


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 9 సంచిక : 221 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : కాకినాడ గురువారం 16 ఏప్రిల్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :9 ISSUE :221 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : KAKINADA THU 16 APRIL 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Kakinada,Ongole,Visakhapatnam,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur


# మత్స్యకారులకు సీఎం చంద్రబాబు ద్రోహం

- కళ్లు మూసి తెరిచేలోగా మళ్లీ మన ప్రభుత్వమన్న జగన్
- కూటమి పాలనలో మత్స్యకారుల పొట్ట కొడుతున్నారని విమర్శ
- జువ్వలదిన్నె నుంచి మత్స్యకారులను తరిమేసే కుట్ర జరుగుతోందని ఆరోపణ
- తమ హయాంలో రూ.26 వేల కోట్లతో పోర్టులు, హార్బర్లు నిర్మించామని వెల్లడి
- అధికారంలోకి రాగానే మత్స్యకారుల హక్కులు కాపాడతామని హామీ



పెన్ పవర్ డెస్క్:మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత జగన్ ఏపీలోని కూటమి ప్రభుత్వంపై, సీఎం చంద్రబాబుపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో ప్రస్తుతం పాలన అన్యాయంగా సాగుతోందని, దేవుడు అన్నీ చూస్తున్నాడని వ్యాఖ్యానించారు. కళ్లు మూసుకుని తెరిచేలోపు మళ్లీ మన ప్రభుత్వం వస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. నెల్లూరు జిల్లా పర్యటనలో భాగం గా ఆయన జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌ను పరిశీలిం చారు. ఈ సందర్భంగా స్థానిక మత్స్యకారులతో ముఖాముఖి నిర్వహించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తమ ప్రభుత్వ హయాంలో మత్స్యకారుల సంక్షేమానికి పెద్దపీట వేశామని జగన్ గుర్తుచేశారు. రాష్ట్రంలో రూ.26 వేల కోట్లతో నాలుగు కొత్త పోర్టులు, 10 ఫిషింగ్ హార్బర్లు, ఆరు ఫిష్ ల్యాండింగ్ సెంటర్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. మచిలీపట్నం, మూలపేట పోర్టుల పనులు 35 శాతం పూర్తి చేశామని, రామాయపట్నం పోర్టు పనులు దాదాపు పూర్తయ్యాయని వివరించారు. 2024 మార్చి 12న తాము జువ్వలదిన్నె హార్బర్‌ను వర్చువల్‌గా ప్రారంభించామని, కానీ నేటికీ దానిని మత్స్యకారులకు ఎందుకు అప్పగించలేదని కూటమి ప్రభుత్వాన్ని జగన్

మిగతా 2లో



## ఇరాన్‌కు ఇక ఆయుధాలు పంపబోమని చైనా చెప్పింది

- తమ మాట విని చైనా వెనక్కి తగ్గిందన్న ట్రంప్
- హార్మూజ్ ను ఇక మూసి ఉంచడం జరగదని ఉద్ఘాటన
- హార్మూజ్ ను తెరిచే ప్రయత్నాలపై చైనా సంతోషంగా ఉందని వెల్లడి
- చర్చలు యుద్ధం కన్నా మంచివని వ్యాఖ్యలు

పెన్ పవర్ డెస్క్:ఇకపై ఇరాన్‌కు ఎలాంటి ఆయుధాలు పంపబో మని చైనా అంగీకరించిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బుధవారం కీలక ప్రకటన

మిగతా 2లో



## క్రీడా దిగ్గజాలతో నారా లోకేశ్ ముఖాముఖి...

### సూచనలు, సలహాలు స్వీకరణ

- ఏపీలో క్రీడాభివృద్ధికి పలు సూచనలు, సలహాలు
- పాఠశాల స్థాయి నుంచే శిక్షణ ఇవ్వాలన్న పీవీ సింధు
- వేసవి శిక్షణా శిబిరాలు నిర్వహించాలని మిథాలీ రాజ్ సూచన
- క్రీడాకారులకు ప్రత్యేక కరిక్యులమ్ పరిశీలించాలన్న మల్లేశ్వరిం

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్‌లో క్రీడారంగానికి పూర్వవైభవం తీసుకొచ్చే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. ఇందులో భాగంగా, రాష్ట్ర విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ తిరుపతిలో జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులతో ముఖాముఖి నిర్వహించారు. రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై వారి నుంచి విలువైన సూచనలు, సలహాలు స్వీకరించారు. కూటమి ప్రభుత్వం క్రీడల అభివృద్ధికి కృషి చేస్తోందని, మంత్రి లోకేష్ అండగా నిలుస్తున్నారని క్రీడాకారులు ప్రశంసించారు. ఈ సందర్భంగా ప్రముఖ

మిగతా 2లో



## ఈ 9 పనులు చేస్తామని మాటివ్వండి

పెన్ పవర్ డెస్క్:ప్రధాని నరేంద్ర మోదీ కర్ణాటకలోని ఆదిచుం చనగిరి మఠాన్ని సందర్శించారు. అక్కడ ఏర్పాటు చేసిన సభలో ప్రధాని ప్రసంగించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి 9 పనుల గురించి మోదీ హామీ తీసుకున్నారు. "మీ నుంచి నాకు తొమ్మిది హామీలు కావాలి. వికసిత్ కర్ణాటక కో సం మీరంతా నాకు వాటిపై ప్రమాణం చేయండి.

మిగతా 2లో

## డీలిమిటేషన్ ఏపీ ప్రయోజనాలను దెబ్బతీస్తుంది

### చంద్రబాబుకు షర్మిల బహిరంగ లేఖ

- ఏపీ తన రాజకీయ ప్రభావాన్ని కోల్పోతుందన్న షర్మిల
- డీలిమిటేషన్ ను చంద్రబాబు వ్యతిరేకించాలని విన్నపం
- దీనిపై చర్చించేందుకు ఒకరోజు ప్రత్యేక అసెంబ్లీ సమావేశాన్ని ఏర్పలుడు చేయాలని సూచన

మిగతా 2లో



## పల్లె ప్రజల కోసం 62 అన్న క్యాంటీన్లు ప్రారంభం...


### పేదల కడుపు నిండినప్పుడే నిజమైన అభివృద్ధి అన్న చంద్రబాబు

- పల్నాడు జిల్లా ధరణికోటలో అన్న క్యాంటీన్‌ను ప్రారంభించిన సీఎం చంద్రబాబు
- రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా 62 గ్రామీణ ప్రాంతాల్లో క్యాంటీన్ల ఏర్పాటు
- పేదల ఆకలి తీరినప్పుడే అది నిజమైన అభివృద్ధి అని వ్యాఖ్య
- గత ప్రభుత్వం అన్నదానాన్ని అడ్డుకుందని తీవ్ర విమర్శలు
- రాష్ట్రంలో 269కి చేరిన అన్న క్యాంటీన్ల మొత్తం సంఖ్య



పెన్ పవర్ డెస్క్:పేదల కడుపు నిండినప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని, ఎంత అభివృద్ధి సాధించినా పేదలకు పట్టెడన్నం లేకపోతే అది వృధా అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. అన్నార్తుల ఆకలి తీర్చడమే లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. బుధవారం పల్నాడు జిల్లా పెదకూరపాడు నియోజకవర్గంలోని ధరణికోటలో

మిగతా 2లో



## రామాలయ నిర్మాణానికి కోటి రూపాయల విరాళాలు

### ఆకివీడు ఆలయంపై రఘురామకృష్ణరాజు వ్యాఖ్యలు

- అన్ని రకాల అనుమతులతో ఆకివీడు రామాలయాన్ని వైభవంగా నిర్మిస్తామన్న రఘురామ
- ఇక్కడ పురాతన రామాలయం ఉందనే విషయం తనకు సాక్షి ద్వారానే తెలిసిందని వెల్లడి
- కల్వరి టెంపుల్ వంటి వారు ప్రార్థనా మందిరాలను వ్యాపార కేంద్రాలుగా మారుస్తున్నారని ఆరోపణ

మిగతా 2లో

## సత్యసాయి జిల్లాలో భారీ పేలుడు.. ఐదుగురి మృతి...

### 12 మంది పరిస్థితి విషమం

- సత్యసాయి జిల్లా కదిరిలో భారీ పేలుడు
- డిటోనేటర్లు, గ్యాస్ సిలిండర్లు పేలడంతో ఘటన
- ప్రమాదంలో ఐదుగురు అక్కడికక్కడే మృతి
- 20 మందికి తీవ్ర గాయాలు
- క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని మంత్రి సత్యకుమార్ ఆదేశం



పెన్ పవర్ డెస్క్:శ్రీ సత్యసాయి జిల్లాలో తీవ్ర విషాద ఘటన చోటుచేసుకుంది. కదిరి మండలంలో ఓ ఇంట్లో నిల్వ ఉంచిన డిటోనేటర్లు, గ్యాస్ సిలిండర్లు పేలడంతో ఐదుగురు

మిగతా 2లో

## దొంగల్లా ఎత్తుకెళ్లడం దేనికి?

### పూడి శ్రీహరి అరెస్టుపై పేర్ని నాని నిప్పులు

- పోలీసు వ్యవస్థ దిగజారడం శోచనీయమన్న పేర్ని నాని
- జగన్ చుట్టూ ఉన్నవారిపై తప్పుడు కేసులు బనాయిస్తున్నారని మండిపాటు
- పర్యవసనాలను చంద్రబాబు అనుభవించక తప్పదని హెచ్చరిక



పెన్ పవర్ డెస్క్:వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూడి శ్రీహరి అరెస్టుపై మాజీ మంత్రి పేర్ని నాని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. టీడీపీ నేతల కళ్లలో ఆనందం కోసం పోలీసు వ్యవస్థను ఇంతలా దిగజార్చడం శోచనీ యమని మండిపడ్డారు. పూడి శ్రీహరి ఏమైనా నేరాలు చేశారా? అని ప్రశ్నించిన నాని, చట్టబద్ధంగా చర్యలు తీసుకోవాలనుకుంటే బహిరంగంగా అరెస్ట్ చేయాలి కానీ, దొంగతనంగా ఎత్తుకెళ్లడం ఏంటని నిలదీశారు. విలేకరి స్థాయి నుంచి

మిగతా 2లో

## మళ్లీ తోక జాడిస్తున్న పాక్...

### భారత్‌లో చొరబడేందుకు 800 మంది టెర్రరిస్టులు సిద్ధం!

- భారత్‌లోకి 800 మంది ఉగ్రవాదులను పంపేందుకు పాక్ భారీ కుట్ర
- సరిహద్దుల్లో 70 ఉగ్రవాద లాంచ్‌ప్యాడ్‌ల పునరుద్ధరణ
- భారత్‌లో ఎన్నికలు, మధ్యప్రాచ్య సంక్షోభమే పాక్‌కు అదును
- కొత్త వ్యూహంతో ఒకేసారి పలుచోట్ల నుంచి చొరబాట్లకు ప్లాన్



పెన్ పవర్ డెస్క్:జమ్మూ కశ్మీర్‌లో మరోసారి అలజడి సృష్టిం చేందుకు పాకిస్థాన్ భారీ కుట్రకు తెరలేపిం ది. సుమారు 800 మంది ఉగ్రవాదులను భారత్‌లోకి పంపేందుకు పాక్ నిఘా సంస్థ ఐఎస్ఐ, ఆ దేశ సైన్యం ప్రణాళికలు రచి స్తున్నట్లు భారత నిఘా వర్గాలు బుధవారం హెచ్చరించాయి. దీని కోసం నియంత్రణ రేఖ (ఎల్ఓసీ), అంతర్జాతీ య సరిహద్దు వెంబడి సుమారు 70 ఉగ్రవాద లాంచ్‌ప్యా డ్‌లను

మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

## మహిళా రిజర్వేషన్లు..
## రాజకీయ లబ్ధి కోసం బిజెపి ఎత్తుగడ

మహిళలకు చట్టసభలలో మూడో వంతు స్థానాలను రిజర్వు చేయటం కోసం ఆమోదించిన చట్టం తక్షణ అమలుకు అవసరమైన సవరణల కోసం ప్రధాని నరేంద్ర మోడీ హడావిడి చేస్తున్నారు. ఈ నెల 16-18 తేదీలలో పార్లమెంటు సమావేశాలను ఏర్పాటు చేస్తున్నామని, ఈ చట్ట సవరణలను ఆమోదించటానికి సహకరించాలని ఆయన అన్ని రాజకీయ పార్టీలకు లేఖలు రాశారు. దేశంలోని ముఖ్యమైన ఐదు రాష్ట్రాల శాసనసభలకు ఎన్నికలు జరుగుతున్న వేళ, మహిళలను ప్రలోభ పెట్టి, రాజకీయ ప్రయోజనం పొందటం లక్ష్యంగా మోడీ ఈ చర్చను ముందుకు తీసుకొచ్చారు. ఎన్నికలు పూర్తయ్యే వరకు పార్లమెంటు సమావేశాలను వాయిదా వేయాలని, ఆ తర్వాత మొదట అఖిలపక్ష సమావేశం జరిపి అన్ని పార్టీల అభిప్రాయాలు తీసుకొని ముందుకు సాగాలని వివిధ రాజకీయ పార్టీలు చేస్తున్న విజ్ఞప్తులు ప్రభుత్వ చెవికెక్కటం లేదు. చట్టసభలలో మూడో వంతు స్థానాలను మహిళలకు రిజర్వేషన్ చేయాలన్న బిల్లును 2023 సెప్టెంబరులో పార్లమెంటు ఏకగ్రీవంగా ఆమోదించింది. నారీ శక్తి విధాన్ అధినియం బిల్లుకు పార్లమెటులో 454 మంది సభ్యులు అనుకూలంగా ఓటు వేయగా ఇద్దరు మాత్రమే వ్యతిరేకించారు. రాజ్యసభ ఏకగ్రీవంగా ఈ బిల్లును ఆమోదించటంతో చట్టంగా మారింది. ఈ చట్టం ప్రకారం లోక్‌సభ, రాష్ట్రాల శాసనసభలు, ఢిల్లీ శాసనసభలో 33 శాతం స్థానాలు మహిళలకు రిజర్వు చేయబడతాయి. రిజర్వేషన్లు 15 సంవత్సరాల పాటు అమలులో ఉంటాయని చట్టంలో పేర్కొన్నారు. ఈ చట్టాన్ని ఆమోదించిన తర్వాత సేకరించిన జనాభా లెక్కల ప్రాతిపదికగా లోక్‌సభ, శాసనసభల స్థానాలను పునర్వవస్థీకరణ చేసి, ఆ ప్రాతిపదికపై మహిళలకు రిజర్వేషన్లు కల్పిస్తామని ప్రభుత్వం చెప్పింది.

2024 పార్లమెంటు, శాసనసభల ఎన్నికలలోనే ఈ చట్టాన్ని అమలు చేయాలని ప్రతిపక్షాలు పట్టుపట్టాయి. కాని జనాభా లెక్కలు, నియోజక వర్గాల పునర్వ్యవస్థీకరణ పేరుతో ప్రభుత్వం చట్టం అమలును వాయిదా వేసింది. అమలును వాయిదా వేసిన ప్రభుత్వమే ఇపుడు చట్టం అమలుకు అందరూ మద్దతివ్వాలని లేఖలు రాయటం హాస్యాస్పదంగా ఉన్నది. లేని నెపాన్ని ప్రతిపక్షాలపై మోపి, లబ్ధి పొందాలనే హ్రస్వదృష్టి మినహా, విశాల దృక్పథంతో ఆలోచించే పరిపక్వత మోడీకి లేదు.బెంగాల్ వామపక్ష ప్రభుత్వం మహిళలకు ×మొదట రిజర్వేషన్లు కల్పించింది. చట్టసభలలో మహిళలకు రిజర్వేషన్లు కల్పించాలన్న భావన బిజెపికి ఏ కోశానా లేదు. 1977లో పశ్చిమ బెంగాల్‌లో అధికారంలోకి వచ్చిన వామపక్ష ప్రభుత్వం మొదటగా పంచాయతీ, సమితి, జిల్లా పరిషత్‌లలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లను కల్పించింది. తర్వాత దానిని 50 శాతానికి పెంచింది. పశ్చిమ బెంగాల్‌ను స్ఫూర్తిగా తీసుకొని నాటి ప్రధాని రాజీవ్ గాంధి దేశ వ్యాపితంగా స్థానిక సంస్థలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల అమలు కోసం 73, 74 రాజ్యాంగ సవరణలు తీసుకొచ్చారు. రాజ్యాంగ సవరణల తర్వాత దేశమంతటా స్థానిక సంస్థలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు జరుగుతున్నాయి.

స్థానిక సంస్థలతో పాటు పార్లమెంటు, రాష్ట్రాల అసెంబ్లీలో కూడా మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కావాలనే డిమాండ్ ఊపందుకుంది. 1996లో దేవెగౌడ ప్రధానిగా ఉన్నపుడు మహిళా రిజర్వేషన్ బిల్లును మొదటగా పార్లమెంటులో ప్రవేశపెట్టారు. తర్వాత మరికొన్ని సార్లు కూడా లోక్‌సభలో మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టినప్పటికీ బిజెపితో పాటు సమాజ్‌వాది, ఆర్‌జెడి లాంటి ప్రతిపక్షాలు కూడా సహకరించక పోవటంతో ఆమోదం పొందలేదు. ప్రతిసారీ ప్రభుత్వం బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టటం, తర్వాత సభ వాయిదాలు పడి, సభ కాల పరిమితి ముగిసిపోవటంతో బిల్లు కూడా మురిగిపోయేది. 2002లో పార్లమెంటులో ఈ బిల్లును ప్రవేశపెట్టినపుడు పూర్తి మద్దతు ఇస్తామని కాంగ్రెస్, వామపక్షాలు వాజ్‌పేయి ప్రభుత్వానికి హామీ ఇచ్చాయి. కాని ప్రభుత్వం బిల్లును ఆమోదించటానికి చొరవ తీసుకోలేదు. 2003లో బిల్లును రెండుసార్లు తిరిగి ప్రవేశపెట్టిన తర్వాత ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం నిర్వహించి, బిల్లును ఆమోదిస్తామని చెప్పింది. కాని ఆ తర్వాత బిల్లును వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ మనోహర్ జోషి ప్రకటించారు. కాంగ్రెస్ బిల్లును అడ్డుకుంటున్నదని, 2004 ఎన్నికలలో పూర్తి మెజారిటీ సాధించిన తర్వాత బిల్లును ఆమోదిస్తామని ఎన్నికలకు కొద్ది రోజుల ముందు వాజ్‌పేయి ప్రకటించారు. కాని 2005లో పార్లమెంటులో తిరిగి బిల్లును ప్రవేశపెట్టగా, కుల ప్రాతిపదికపై బి.సి మహిళలకు కోటాలో ప్రత్యేక కోటా ఇవ్వాలని ఉమా భారతి, ఇతర బిజెపి నాయకులు డిమాండ్ చేసి బిల్లుకు ఆటంకం కల్పించారు. సమాజ్‌వాది, ఆర్‌జెడి తదితర పార్టీలు కూడా ఆటంకాలు కల్పించినప్పటికీ, బిజెపి పూర్తి మద్దతిచ్చి, నిజాయితీగా వ్యవహరించినట్లైతే మహిళా రిజర్వేషన్ బిల్లు ఎప్పుడో ఆమోదం పొందేది.

యుపిఎ ప్రభుత్వం 2008లో ఈ బిల్లును మొదట రాజ్యసభలో ప్రవేశపెట్టింది. 2010 మార్చి 9వ తేదీన రాజ్యసభ ఈ బిల్లును మూడింట రెండొంతుల మెజారిటీతో ఆమోదించింది. ఆమోదానికి ముందు బిల్లుపై రెండు రోజులు చర్చ జరిగింది. చర్చ సందర్భంలో నాటకీయ సన్నివేశాలతో పాటు హింసాత్మక ఘటనలు కూడా చోటు చేసుకున్నాయి. కొందరు ఎంపీలు పరస్పరం దూషించుకోవటంతో పాటు చేయి చేసుకొనే పరిస్థితులు కూడా ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలో రాజ్యసభలో మహిళా రిజర్వేషన్ చట్టాన్ని ఆమోదించినప్పటికీ లోక్‌సభ ఆమోదించలేదు. మహిళా రిజర్వేషన్ల కోసం మహిళలు, వామపక్షాలు, ప్రజల నుండి ఒత్తిడి పెరుగుతుండటం, నాడు పార్లమెంటులో గణనీయ శక్తిగా ఉన్న వామపక్షాలు పూర్తి మద్దతివ్వటంతో ఇక వాయిదా వేయటం బిజెపికి సాధ్యం కాలేదు. తప్పనిసరి పరిస్థితులలో 2023లో ఆమోదించినా, అమలుకు ఆటంకాలు కల్పించింది. ఇపుడు రాజకీయ ప్రయోజనాల కోసం తక్షణం అమలు చేయాలని మోడీ యాగీ చేస్తున్నారు. మనువాద దృక్పథం జీర్ణించుకుపోయిన బిజెపి మహిళలు రాజకీయంగా ఉన్నత స్థానాలలోకి రావటాన్ని అంగీకరించదు. మహిళలను అవమానించటం, వారిని వేధించటం బిజెపి, ఆ పార్టీ సోషల్ మీడియా విభాగానికి, వారి నాయకులకు నిత్యకృత్యంగా ఉన్నది. 2002లో గుజరాత్‌లో మహిళలపై అత్యాచారాలు, హింసాకాండను ఏ విధంగా కొనసాగించారో దేశమంతా చూసింది. మోడీ ముఖ్యమంత్రిగా ఉండగానే ఈ దారుణాలు జరిగాయి. బాధితులకు సహాయం చేస్తున్న తీస్తా సెతల్వాద్ లాంటి స్వచ్ఛంద సేవకులను, రాణా ఆయూబ్ లాంటి జర్నలిస్టులను వెంటాడి వేధిస్తున్నారు. సాక్షి మాలిక్, వినేశ్ ఫోగట్ లాంటి క్రీడాకారులను బిజెపి నాయకుడు, రెజ్లింగ్ ఫెడరేషన్ అధ్యక్షుడు వేధిస్తున్నాడని రోజుల తరబడి రోదించినప్పటికీ ప్రభుత్వం పట్టించుకోలేదు. మణిపూర్‌లో మహిళలపై అత్యాచారం, నగంగా ఊరేగించటం వంటి వాటికి పాల్పడిన వారిపై ఆ ప్రభుత్వం ఏ మాత్రం చర్యలు తీసుకోలేదు. మతం, ప్రాంతం, గుర్తింపు ఆధారంగా బిజెపి వ్యవహరిస్తున్నది. తమకు కాని మతం, ప్రాంతం వారైతే ఎటువంటి దారుణాలు జరిగినా పట్టించుకోవటం లేదు. గుర్తింపు ఏదైనప్పటికీ మహిళలు మహిళలే. ఒక మహిళ గౌరవాన్ని కాపాడలేని వారు ఇతర మహిళలకు రక్షణ కల్పిస్తారన్నది కల్ల. మహిళల గౌరవాన్ని కాపాడలేని వారు వారిని రాజకీయ అధికారంలో భాగంగా చేసుకుంటారనేది కూడా నమ్మలేం. కాని ప్రస్తుతం మన దేశంలో అమలులో ఉన్న పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థలో మహిళల ఓట్లు సంపాదించాలంటే వారికి రిజర్వేషన్లు, కొంత మేరకు అధికారంలో భాగం కల్పించటం తప్పనిసరి. అందువలన మనువాదం అమలు కోసం సన్నాహాలు చేస్తున్న బిజెపి కూడా మహిళలకు అధికారంలో భాగం కల్పించటం గురించి మాట్లాడుతున్నది. అందువలన మహిళా బిల్లుపై బిజెపి చేస్తున్న ప్రచారం ఎన్నికల లబ్ధి కోసం మినహా నిజంగా మహిళలకు అధికారంలో భాగం పంచటం కోసం చేస్తున్నది కాదు. మహిళలలో పెరుగుతున్న చైతన్యం, వామపక్ష ఉద్యమాల ప్రభావం, బిజెపికి తగ్గుతున్న ప్రజల మద్దతు ఇటువంటి విన్యాసాలు చేయక తప్పని పరిస్థితులను ఆ పార్టీకి కల్పిస్తున్నాయి. బిజెపి ఎటువంటి వాగ్దానాలు చేసినప్పటికీ మహిళల హక్కుల సాధన కోసం జరుగుతున్న పోరాటాలను అడ్డుకోవటం, దారి తప్పించటం ఆ పార్టీకి సాధ్యం కాదు.

# డీలిమిటేషన్ ఏపీ ప్రయోజనాలను దెబ్బతీస్తుంది

నియోజకవర్గాల పునర్విభజన అంశంపై ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిల ముఖ్యమంత్రి చంద్రబాబుకు మూడు పేజీల బహిరంగ లేఖ రాశారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన 2011 జనాభా లెక్కల ఆధారిత పునర్విభజన ప్రక్రియ రాష్ట్ర ప్రయోజనాలను దారుణంగా దెబ్బతీస్తుందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుత ప్రతిపాదనల వల్ల ఆంధ్రప్రదేశ్ తన రాజకీయ ప్రభావాన్ని కోల్పోవడమే కాకుండా, వేల కోట్ల రూపాయల ఆర్థిక అవకాశాలను కూడా నష్టపోతుందని షర్మిల హెచ్చరించారు. ఇది రాష్ట్ర భవిష్యత్తుకు పెద్ద ముప్పుగా మారుతుందని పేర్కొన్నారు. దక్షిణాది రాష్ట్రాలకు, ముఖ్యంగా ఏపీకి అన్యాయం చేసే ఈ డీలిమిటేషన్ ప్రక్రియను ముఖ్యమంత్రిగా చంద్రబాబు బహిరంగంగా, నిస్సంకోచంగా వ్యతిరేకించాలని ఆమె కోరారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, పార్టీలకతీతంగా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 25 మంది లోక్‌సభ సభ్యులు, 11 మంది రాజ్యసభ సభ్యులను ఏకతాటిపైకి తీసుకురావాలని సూచించారు. పార్లమెంటులో ఈ బిల్లుకు వ్యతిరేకంగా ఓటు వేసేలా అందరినీ ప్రోత్సహించాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై చర్చించేందుకు అత్యవసరంగా ఒకరోజు ప్రత్యేక శాసనసభ సమావేశాన్ని ఏర్పాటు చేయాలని షర్మిల కోరారు. డీలిమిటేషన్ ఫ్రేమ్‌వర్క్‌ను తిరస్కరిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేసి, దానిని కేంద్రానికి పంపాలని సూచించారు. ఇది కేవలం రాజకీయ నిర్ణయం మాత్రమే కాదని, భావితరాల భవితను కాపాడే రాజ్యాంగ బాధ్యతని ఆమె గుర్తు చేశారు. కేంద్రంలో అధికార కూటమిలో భాగస్వామిగా ఉన్న టీడీపీ, రాష్ట్ర హక్కుల కోసం గట్టిగా నిలబడాలని ఈ లేఖ ద్వారా ఆమె విజ్ఞప్తి చేశారు.

## క్రీడా దిగ్గజాలతో నారా లోకేశ్ ముఖాముఖి... సూచనలు, సలహాలు స్వీకరణ

- మొదటి పేజి తరువాయి

బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు మాట్లాడుతూ, పాఠశాల స్థాయి నుంచే పిల్లలకు ఇష్టమైన క్రీడలో శిక్షణ ఇవ్వాలని సూచించారు. భారత మహిళా క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ మిథాలీ రాజ్ వేసవి శిక్షణా శిబిరాలు ఏర్పాటు చేయాలని, ప్రతిభావంతులను గుర్తించి ప్రోత్సహించాలని కోరారు. అర్జున అవార్డు గ్రహీత కరణం మల్లేశ్వరి మాట్లాడుతూ, ఢిల్లీ స్పోర్ట్స్ యూనివర్సిటీ తరహాలో ఏపీలోనూ క్రీడాకారుల కోసం ప్రత్యేక కరిక్యులమ్ రూపొందించే అంశాన్ని పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు.

గతంలో తనకు మంత్రి లోకేష్ అండగా నిలిచారని ప్రముఖ అథ్లెట్ యర్రాజీ జ్యోతి గుర్తుచేసుకున్నారు. అథ్లెటిక్స్‌తో పాటు ఇతర క్రీడలకు మౌలిక సదుపాయాలు మెరుగుపరచాలని కోరారు. డీఎస్సీలో స్పోర్ట్స్ కోటా కింద 421 మందికి ఉద్యోగాలు కల్పించడం పట్ల ఖోఖో క్రీడాకారుడు శివారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లోని హాకీ క్రీడాకారులను ప్రోత్సహించాలని హాకీ క్రీడాకారిణి రజని కోరారు. 2028 ఒలింపిక్స్‌కు సిద్ధమవుతున్న తనకు ప్రభుత్వం ఆర్థిక సాయం ద

అందించాలని బ్యాడ్మింటన్ క్రీడాకారిణి సూర్య చరిష్మ అభ్యర్థించారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో క్రీడారంగం మళ్లీ అభివృద్ధి పథంలో పయనిస్తుందని పలువురు క్రీడాకారులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో కిడాంబి శ్రీకాంత్, ఇల్లూరి అజయ్ కుమార్ రెడ్డి, లలిత్ బాబు, షేక్ అర్షద్‌తో పాటు పలువురు క్రీడాకారులు, శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు పాల్గొన్నారు.

# రామాలయ నిర్మాణానికి కోటి రూపాయల విరాళాలు

పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడులో రామాలయ పునర్నిర్మాణం కోసం భక్తుల నుంచి కోటి రూపాయల విరాళాలు సమకూరాయని ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు వెల్లడించారు. ఈ ఆలయ నిర్మాణానికి సంబంధించి హైకోర్టులో జరుగుతున్న విచారణపై ఆయన ఈరోజు స్పందించారు. త్వరలోనే అన్ని రకాల ప్రభుత్వ అనుమతులతో అత్యంత వైభవంగా ఆలయాన్ని నిర్మిస్తామని ఆయన స్పష్టం చేశారు.ఆకివీడులో పురాతన రామాలయం ఉందనే విషయం సాక్షి మీడియా కథనాల ద్వారానే తనకు మొదట తెలిసిందని, అయితే అక్కడకు వెళ్లినప్పుడు తనపై దాడి చేయించారని రఘురామ ఆరోపించారు. అనుమతి లేకుండా ఆలయం నిర్మిస్తున్నారని న్యాయవాది జడా శ్రవణ్ మరికొందరు హైకోర్టులో పిటిషన్ వేశారని, దీనిపై నేడు విచారణ జరిగిందని తెలిపారు. ఆలయం, మసీదు లేదా చర్చి.. ఏదైనా సరే జిల్లా కలెక్టర్ అనుమతి తప్పనిసరని, చట్టబద్ధంగానే రామాలయ నిర్మాణం చేపడతామని కోర్టుకు విన్నవించినట్లు చెప్పారు.ఆలయ నిర్మాణానికి నిబంధనలు గుర్తు చేస్తున్నారని, కానీ కొందరు నిర్వహిస్తున్న చర్చిలకు మాత్రం ఎటువంటి అనుమతులు లేవని రఘురామ ఆరోపించారు. తాడేపల్లిగూడెంలో మీటింగ్ హాల్ పేరుతో అనుమతి తీసుకుని చర్చిగా మార్చారని, దీనిపై అధికారులు నోటీసులు ఇచ్చినా స్పందన లేదని మండిపడ్డారు.నంబూరు వద్ద ఉన్న కల్వరి టెంపుల్‌తో సహా పలు ప్రాంతాల్లో ప్రార్థనా మందిరాలను వ్యాపార కేంద్రాలుగా మారుస్తున్నారని, ఇలాంటి అక్రమ నిర్మాణాలపై అధికారులు విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## పల్లె ప్రజల కోసం 62 అన్న క్యాంటీన్లు ప్రారంభం...

- మొదటి పేజి తరువాయి

ఏర్పాటు చేసిన గ్రామీణ అన్న క్యాంటీన్‌ను ఆయన కార్మికులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రూ.5 వెచ్చించి టోకెన్ కొనుగోలు చేసి, అక్కడి కార్మికులతో కలిసి భోజనం చేశారు. అంతకుముందు, క్యాంటీన్‌కు వచ్చిన పేదలకు, కార్మికులకు ఆయనే స్వయంగా వడ్డించారు.ఈ కార్యక్రమంలో సీఎం మాట్లాడుతూ, "పేదవాడి ఆకలి తీర్చడానికే ప్రజా ప్రభుత్వం అన్న క్యాంటీన్లు తెచ్చింది. ఎన్టీఆర్ రూ.2కే కిలో బియ్యం ఇచ్చి ఆహార భద్రతకు నాంది పలికారు. అదే స్ఫూర్తితో సంక్షేమాన్ని కొనసాగిస్తున్నాం" అని అన్నారు. 2024లో అధికారంలోకి రాగానే తొలుత పట్టణాల్లో, ఇప్పుడు గ్రామీణ ప్రాంతాల్లోనూ అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేశామని గుర్తుచేశారు. కొత్తగా 62 గ్రామీణ క్యాంటీన్లు ప్రారంభం కావడంతో, రాష్ట్రంలో మొత్తం క్యాంటీన్ల సంఖ్య 269కి చేరిందని, త్వరలో మరో 5 సిద్ధమవుతాయని వివరించారు.అన్న క్యాంటీన్ల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా రోజూ 2.10 లక్షల మంది ఆకలి తీర్చుకుంటున్నారని, దీనికోసం ప్రభుత్వం రోజుకు రూ.54 లక్షలకు పైగా ఖర్చు చేస్తోందని సీఎం తెలిపారు. నాణ్యమైన భోజనం అందించడంలో అక్షయపాత్ర ఫౌండేషన్ సేవలను ఆయన అభినందించారు. కొత్తగా ప్రారంభించిన క్యాంటీన్ల నిర్మాణానికి రూ.43 కోట్లు, వాటి నిర్వహణకు ఏడాదికి అదనంగా రూ.58 కోట్లు ఖర్చవుతుందని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా గత వైసీపీ ప్రభుత్వంపై చంద్రబాబు తీవ్ర స్థాయిలో విమర్శలు

చేశారు. "గత పాలకులు అన్న క్యాంటీన్లను మూసివేసి పేదల పొట్టగొట్టారు. వారికి విధ్వంసం, హింస, కూల్చడం మాత్రమే తెలుసు. అందుకే ఆ పార్టీ పేరును 'గొడ్డలి పార్టీ'గా మార్చుకోవాలి. ఒక రాజకీయ పార్టీగా ఉండే అర్హతను వైసీపీ కోల్పోయింది" అని ఆయన వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే ప్రవీణ్, జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా తదితరులు పాల్గొన్నారు.

# మళ్లీ తోక జాడిస్తున్న పాక్...
## భారత్‌లో చొరబడేందుకు 800 మంది టెర్రరిస్టులు సిద్ధం!

- మొదటి పేజి తరువాయి

పునరుద్ధరించినట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి.ప్రస్తుతం ప్రపంచ దేశాల దృష్టి మధ్యప్రాచ్య సంక్షోభంపై కేంద్రీకృతమై ఉండటం, అదే సమయంలో భారత్‌లో పలు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతుండటంతో ఇదే అదునుగా భావించి పాక్ ఈ కుట్రకు పాల్పడుతోందని ఓ అధికారి తెలిపారు. ఈ అవకాశాన్ని వాడుకొని భారీ ఎత్తున ఉగ్రవాదులను కశ్మీర్‌లోకి పంపాలని ఐఎస్ఐ, పాక్ సైన్యం భావిస్తున్నట్లు నిఘా వర్గాలు పేర్కొన్నాయి. పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని లాంచ్‌ప్యాడ్‌లకు ఇప్పటికే పెద్ద సంఖ్యలో ఉగ్రవాదులను తరలించి, చొరబాటుకు సిద్ధంగా ఉంచారని సమాచారం.ఇటీవలి కాలంలో భారత భద్రతా బలగాల అప్రమత్తతతో పలు చొరబాటు యత్నాలు విఫలమయ్యాయి. దీంతో పాక్ తన వ్యూహాన్ని మార్చుకుంది. ఇప్పుడు ఒకేసారి పలు ప్రాంతాల నుంచి 10 నుంచి 15 మంది చొప్పున ఉగ్రవాదుల బృందాలను పంపి, భద్రతా బలగాల దృష్టిని మరల్చాలని చూస్తోంది. ఈ పద్ధతిలో కనీసం కొందరైనా లోపలికి ప్రవేశించగలరని వారు భావిస్తున్నారు.గతేడాది భారత బలగాలు నిర్వహించిన 'ఆపరేషన్ సిందూర్' తర్వాత ఉగ్రవాద మౌలిక సదుపాయాలు దెబ్బతినడంతో పాక్‌పై ఒత్తిడి పెరిగింది. దీంతో కశ్మీర్‌లో కార్యకలాపాలు నిలిచిపోవడంపై లష్కరే తోయిబా వంటి ఉగ్రవాద సంస్థల నుంచి ఐఎస్ఐపై ఒత్తిడి వస్తున్నట్లు తెలుస్తోంది. స్థానిక నెట్‌వర్క్‌లు బలహీనపడటంతో, సరిహద్దుల నుంచి శిక్షణ పొందిన, యుద్ధ నైపుణ్యం ఉన్న ఉగ్రవాదులను పంపి భారీ దాడులకు పాల్పడాలని ఐఎస్ఐ యోచిస్తున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.

## సత్యసాయి జిల్లాలో భారీ పేలుడు.. ఐదుగురి మృతి...

- మొదటి పేజి తరువాయి

మృతి చెందారు. ఈ ఘోర ప్రమాదంలో మరో 20 మంది గాయపడ్డారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర భయాందోళనలు సృష్టించింది.వివరాల్లోకి వెళితే, కదిరి మండలం కుమ్మరవాండ్లపల్లి గ్రామంలోని ఓ కూలీ ఇంట్లో మంగళవారం ఈ దుర్ఘటన జరిగింది. ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన నాలుగు డిటోనేటర్లు మొదట పేలాయి. ఈ పేలుడు ధాటికి మంటలు చెలరేగి, అక్కడే ఉన్న గ్యాస్ సిలిండర్లకు అంటుకున్నాయి. దీంతో భారీ శబ్దంతో పేలుడు సంభవించి, ఇల్లు పూర్తిగా ధ్వంసమైంది. ఈ ప్రమాదంలో ఐదుగురు అక్కడికక్కడే మృతి చెందారు.ప్రమాద సమాచారం అందిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను హుటాహుటిన కదిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. గాయపడిన వారిలో 12 మంది పరిస్థితి విషమంగా ఉన్నట్టు వైద్యులు తెలిపారు. ఈ దుర్ఘటనపై మంత్రి సత్యకుమార్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, అక్రమంగా డిటోనేటర్లు ఎందుకు నిల్వ ఉంచారనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

## దొంగల్లా ఎత్తుకెళ్లడం దేనికి?
## పూడి శ్రీహరి అరెస్టుపై పేర్ని నాని నిప్పులు

- మొదటి పేజి తరువాయి

ఎదిగిన వ్యక్తిని ఉగ్రవాదిలా చిత్రీకరిస్తూ కంప్యూటర్లు, ఫోన్లు సీజ్ చేయడం దారుణమన్నారు.

జగన్ చుట్టూ ఉన్నవారిని భయపెట్టాలనే కుట్రతోనే 20 నెలలుగా తప్పుడు కేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు. ఇలాంటి చర్యలతో, జగన్ వెంట జెండా మోసేవారిని ఆపలేరని స్పష్టం చేశారు. "శ్రీహరిని 15 రోజులు జైల్లో పెట్టగలరు, అంతకంటే ఏం చేయగలరు? జైలు నుంచి వచ్చాక ఆయన మళ్ళీ జగన్ కోసమే పనిచేస్తారు" అని అన్నారు. లోకేశ్ మాటలు విని పోలీసు వ్యవస్థను పతనావస్థకు తీసుకెళుతున్నారని, దీని పర్యవసానాలను చంద్రబాబు అనుభవించక తప్పదని హెచ్చరించారు. రాజకీయ కక్షల కోసం పోలీసులను వాడుకున్న ఏ ప్రభుత్వం కూడా బతికి బట్టకట్టలేదని గుర్తు చేశారు.ప్రభుత్వం చేస్తున్న తప్పులను ప్రశ్నిస్తున్నందుకే అక్రమ అరెస్టులకు పాల్పడుతున్నారని, ప్రజలు ఇప్పటికే చంద్రబాబుకు మంగళహారతి పాడేందుకు సిద్ధంగా ఉన్నారని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా తప్పుడు కేసులు పెట్టడం మానుకోవాలని, అధికార దుర్వినియోగానికి పాల్పడవద్దని చంద్రబాబు, లోకేశ్ లకు హితవు పలికారు. పోలీసులు కూడా అతిగా వ్యవహరించి భవిష్యత్తులో ఇబ్బందులు కొనితెచ్చుకోవద్దని సూచించారు.

## మత్స్యకారులకు సీఎం చంద్రబాబు ద్రోహం

- మొదటి పేజి తరువాయి

ప్రశ్నించారు. చంద్రబాబు ప్రభుత్వం మత్స్యకారులకు మేలు చేయకపోగా, వారి పొట్ట కొడుతోందని విమర్శించారు. జువ్వలదిన్నె నుంచి మత్స్యకారులను తరిమివేసేందుకు కుట్ర జరుగుతోందని ఆరోపించారు.మార్చి 12న నారా లోకేశ్ జువ్వలదిన్నెను సందర్శించగా, 16న ఇక్కడ సీజ్ చేసిన బోట్లు ఎత్తుకెళ్లిపోయారని జగన్ ఆరోపించారు. అధికారంలో ఉన్న పెద్దలే ఈ దొంగతనం చేశారని, అందుకే ఒక్కరినీ అరెస్టు చేయలేదని అన్నారు. బోట్లు ఎత్తుకెళ్లేవారికి ముఖ్యమంత్రి కొడుకు ఆశీస్సులు ఉన్నాయని సంచలన వ్యాఖ్యలు చేశారు.మూడేళ్లు కళ్లు మూసి తెరిచేలోగా గడిచిపోతాయని, ఆ తర్వాత వచ్చేది తమ ప్రభుత్వమేనని జగన్ ధీమా వ్యక్తం చేశారు. తాము అధికారంలోకి రాగానే ప్రైవేట్ డిఫెన్స్ కంపెనీని ఇక్కడి నుంచి తరలిస్తామని హామీ ఇచ్చారు. ఫిషింగ్ హార్బర్లు మత్స్యకారుల హక్కు అని, వాటిని చంద్రబాబు తాత కూడా వారి నుంచి తీసుకోలేరని జగన్ స్పష్టం చేశారు.

## ఈ 9 పనులు చేస్తామని మాటివ్వండి

- మొదటి పేజి తరువాయి

ఈ ప్రమాణాలను శ్రద్ధగా, నిజాయతీగా పాటిస్తే కర్ణాటకతో పాటు దేశ అభివృద్ధీ వేగంగా జరుగుతుంది" అని మోదీ వెల్లడించారు. ప్రధాని అడిగిన హామీలు ఏంటంటే..

నీళ్లను వృథా చేయకుండా పొదుపుగా వాడదాం.
పబ్లిక్ ప్రదేశాల్లో పరిశుభ్రతను పాటిద్దాం
అమ్మ పేరుతో మొక్కలు నాటుదాం.
'వోకల్ ఫర్ లోకల్' స్వదేశీయతను చాటి చెబుదాం.
జాతీయ పర్యావరణ రంగాన్ని అభివృద్ధి చేద్దాం.
రసాయనాలు లేకుండా పంట సాగు చేద్దాం.
ఆహారంలో మిల్లెట్స్‌ని భాగం చేసుకుందాం.
నూనె పదార్థాలను పూర్తిగా తగ్గిద్దాం.
ఫిట్‌గా, బరువుని అదుపులో ఉంచుతూ, ప్రకృతికి సేవ చేద్దాం

ఇక, ఆయుష్మాన్ భారత్ పథకంలో భాగంగా కొన్ని కోట్ల మంది ప్రజలకు ఉచితంగా వైద్య సౌకర్యం అందిస్తున్నామని మోదీ ఈ సందర్భంగా వెల్లడించారు. ప్రస్తుతం ఈ పథకం కింద 70 ఏళ్లు పైబడిన వృద్ధులకు కూడా అవకాశం కల్పించామని గుర్తుచేశారు.

## ఇరాన్‌కు ఇక ఆయుధాలు పంపబోమని చైనా చెప్పింది

- మొదటి పేజి తరువాయి

చేశారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో, వ్యూహాత్మకంగా కీలకమైన హర్మూజ్ జలసంధిని శాశ్వతంగా తెరిచి ఉంచేందుకు తాను చేస్తున్న ప్రయత్నాలకు చైనా మద్దతు తెలిపిందని ఆయన పేర్కొన్నారు.ఈ విషయంపై తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ట్రూత్ సోషల్'లో ట్రంప్ ఒక పోస్ట్ చేశారు. "ఇకపై హర్మూజ్ ను మూసి ఉంచడం జరగదు. హర్మూజ్ జలసంధిని నేను శాశ్వతంగా తెరుస్తుండటం చైనాకు చాలా సంతోషాన్నిచ్చింది. అమెరికాతో పాటు ప్రపంచం కోసం నేను ఈ పని చేస్తున్నాను. వారు ఇరాన్‌కు ఆయుధాలు పంపబోమని అంగీకరించారు" అని ఆయన రాసుకొచ్చారు.ప్రపంచ ఇంధన సరఫరాలో హార్మూజ్ జలసంధి చాలా కీలకమైనది. ఇటీవలి కాలంలో ఈ ప్రాంతంలో ఉద్రిక్తతలు పెరిగాయి. మరోవైపు, చైనా ఇరాన్‌కు ఆయుధాలు సరఫరా చేస్తోందంటూ గతంలో వార్తలు వచ్చిన నేపథ్యంలో ట్రంప్ తాజా వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తో తనకున్న సంబంధాల గురించి కూడా ట్రంప్ ప్రస్తావించారు. "నేను చైనా వెళితే అధ్యక్షుడు షీ జిన్ పింగ్ నన్ను గట్టిగా ఆలింగనం చేసుకుంటారు. మేమిద్దరం కలిసి తెలివిగా పనిచేస్తున్నాం. ఇది యుద్ధం కన్నా మంచిది కదా?" అని వ్యాఖ్యానించారు. అయితే, అవసరమైతే యుద్ధానికి కూడా అమెరికా సిద్ధమేనని హెచ్చరించారు.కాగా, అమెరికాతో ఇరాన్ చర్చలకు పాకిస్థాన్ మధ్యవర్తిత్వం నెరుపుతున్నప్పటికీ, ఇరాన్ ను చర్చల వరకు తీసుకురావడం వెనుక చైనా హస్తం ఉందని ఇప్పటికే పలు కథనాలు వచ్చాయి. తెరవెనుక చైనా మంత్రాంగం నడుపుతోందని భావిస్తున్నారు. ఈ క్రమంలో, ట్రంప్ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

## పెద్దాపురంలోని జిల్లా కోర్టును సందర్శించిన ఆదిత్య యూనివర్సిటీ ఫోరెన్సిక్ సైన్స్ విద్యార్థులు



**గండేపల్లి, పెన్ పవర్, ఏప్రిల్ ,15:**గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ: విద్యార్థులకు ప్రాక్టికల్ అవగాహన కల్పించేందుకు ఆదిత్య యూనివర్సిటీ ఫోరెన్సిక్ సైన్స్ మరియు సైబర్ సెక్యూరిటీ మరియు డిజిటల్ ఫోరెన్సిక్స్ విభాగానికి చెందిన బి.ఎస్సి మరియు ఎం.ఎస్సి విద్యార్థులు పెద్దాపురంలోని ఏడవ అదనపు జిల్లా కోర్టును మూడు రోజుల పాటు సందర్శిస్తున్నారు.

మొదటి రోజు బి.ఎస్సి మొదటి సంవత్సరం ఫోరెన్సిక్ సైన్స్ విద్యార్థులు కోర్టును సందర్శించి కోర్టు విచారణలను ప్రత్యక్షంగా వీక్షించారు. కోర్టు ప్రక్రియలు, న్యాయపద్ధతులు మరియు న్యాయస్థానంలో ఫోరెన్సిక్ నిపుణుల పాత్రపై విద్యార్థులు అవగాహన పొందారు.

ఈ సందర్శన ద్వారా విద్యార్థులకు కోర్టు వాతావరణంపై అవగాహన పెంపొందించడంతో పాటు విశ్లేషణాత్మక మరియు విమర్శనాత్మక ఆలోచన సామర్థ్యాలు అభివృద్ధి చెందుతాయని స్కూల్ అఫ్ సైన్సెస్ అసోసియేట్ డీన్, విలాస్ అనిల్ చవాన్ తెలిపారు.

ఈ సందర్శన ద్వారా సిద్ధాంత జ్ఞానం మరియు ప్రాక్టికల్ అనుభవం మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించడమే లక్ష్యంగా ఈ సందర్శన యొక్క ముఖ్య ఉద్దేశం అని డిపార్ట్మెంట్ ఇన్‌చార్జ్, పి వి నాగేశ్వర రావు తెలిపారు.

## ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూకు శు భాకాంక్షలు తెలియజేసిన జాస్తి వసంత్



**గండేపల్లి, పెన్ పవర్, ఏప్రియల్ 15:**జగ్గంపేట నియోజకవర్గం , ఎమ్మెల్యే , తిరుమల తిరుపతి దేవస్థానం నెంబర్ జ్యోతుల నెహ్రూ కు రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అదనంగా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర పోలీస్ గా నియమించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ గండేపల్లి మండలం మురారి గ్రామ ఉప సర్పంచ్, తెలుగుదేశం పార్టీ క్లస్టర్ ఇంచార్జ్ జాస్తి వసంత్ స్వయంగా కలసి పుష్ప గుత్యం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా జాస్తి వసంత మాట్లాడుతూ జగ్గంపేట నియోజకవర్గం అభివృద్ధి ప్రదాత, నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న కృషివలు, ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన మహా నాయకుడు , మన నాయకులు జ్యోతుల నెహ్రూ ను ముఖ్యమంత్రివర్యులు చంద్రబాబు నాయుడు రాష్ట్ర పోలీస్ బ్యూరో సభ్యులుగా నియమించడం ఆనందదాయకంగా ఉందని మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నామని అన్నారు. ఈయన వెంట మురారి గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఉన్నారు.

## పారిశుధ్ధ్య కార్మికులకు పుష్ కార్టులు, రక్షణ పరికరాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే ఆనందరావు



**అమలాపురం/ అంబాజీపేట, పెన్ పవర్, ఏప్రిల్ 15:** అమలాపురం పట్టణాన్ని పారిశుద్ధ్యంలో ఆదర్శంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని స్థానిక శాసనసభ్యులు అయితాబత్తుల ఆనందరావు పేర్కొన్నారు. బుధవారం అమలాపురం మున్సిపల్ కార్యాలయం వద్ద జరిగిన పారిశుద్ధ్య పరికరాల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పురపాలక సంఘ పరిధిలోని 1 నుండి 30 వార్డులలో పారిశుద్ధ్యాన్ని మరింత మెరుగుపరచడానికి సుమారు 10 లక్షల రూపాయల వ్యయంతో 50 పుష్ కార్టులను, అలాగే 5 లక్షల రూపాయల వ్యయంతో 350 డస్ట్ బిన్నులను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. పారిశుధ్ధ్య కార్మికుల భద్రతకు తాము అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని, అందులో భాగంగా 3 లక్షల రూపాయల వ్యయంతో వారికి రేడియం జాకెట్లు, గ్లౌవ్స్ మరియు మాస్కులను అందజేసినట్లు వివరించారు. పట్టణంలో పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్న మహిళలను ప్రోత్సహించే దిశగా స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ సహకారంతో పలు కీలక చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే తెలిపారు. కిచెన్ గార్డెన్స్, టెర్రాస్ గార్డెన్స్ నిర్వహిస్తూ హోమ్ కంపోస్ట్ ద్వారా మొక్కలను పెంచుతున్న మహిళలకు 75 వేల రూపాయల విలువైన 62 కంపోస్ట్ బిన్నుల కిట్లను పంపిణీ చేశారు. అమలాపురం పట్టణాన్ని సుందరం, ఆరోగ్యకరంగా ఉంచేందుకు ప్రజలందరూ భాగస్వాములు కావాలని, ప్రతి ఇంట్లోనూ తడి-పొడి చెత్తను వేరు చేసి మున్సిపల్ సిబ్బందికి అందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో అముడా చైర్మన్ అల్లాడ స్వామి నాయుడు, కమిషనర్ నిర్మల కుమార్ తిక్కిరెడ్డి నేతాజీ, కర్రి దత్తుడు, ఆశెట్టి ఆదిబాబు, బొర్రా చిట్టిబాబు, జంగా అబ్బాయి వెంకన్న మున్సిపల్ అధికారులు, ప్రజా ప్రతినిధులు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

# తాళ్లూరులో పోషణ పక్వాడ్



పోషక విలువలు పై వివరించిన సూపర్వైజర్ నాగపార్వతి



**గండేపల్లి, పెన్ పవర్, ఏప్రిల్, 15:**గండేపల్లి మండలం తాళ్లూరు అంగన్వాడి 1,2 సెంటర్లో, కార్యకర్తలు వై వి లక్ష్మి, పి చిన్నారి ఆధ్వర్యంలో నిర్వహించిన పోషణ్ పక్వాడ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సూపర్వైజర్ నాగ పార్వతి గర్భవతులు తీసుకోవలసిన జాగ్రత్తలు మరియు పౌష్టికారమైన ఆహారం తీసుకోవాలని సూచించారు. అలాగే పిల్లలకు జంక్ ఫుడ్ తినిపించవద్దని ఇంటిదగ్గర తయారు చేసిన ఆహారాన్ని పిల్లలకు తినిపించడం ద్వారా ఆరోగ్యం ఉంటుందని తెలిపారు . అలాగే స్క్రీన్ అనగా సెల్ ఫోన్లు టీవీలు అధికంగా వాడకం వల్ల కంటిచూపు సన్నగిలుగుతుందని వాటికి దూరంగా పిల్లలను ఉంచాలని తెలియజేశారు. పిల్లలను కుటుంబ సభ్యుల భాగస్వామ్యంతో పెంచడం ద్వారా మంచి అలవాట్లు అలవర్చుకుంటారని పిల్లల తల్లిదండ్రులు తప్పనిసరిగా కుటుంబ సభ్యుల మధ్యనే పిల్లలు జీవించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. ముఖ్యంగా అంగన్వాడి కేంద్రాల ద్వారా పౌష్టికరమైన ఆహారం అర్హులైన లబ్ధిదారులకు ఇస్తున్నారు కనుక తప్పనిసరిగా లబ్ధిదారులు కేంద్ర వద్దకు వెళ్లి ఆహారాన్ని తీసుకుని అదే వాడాలని తెలియజేశారు. పురుషులు భాగస్వామ్యులై రాగు జావా, అటుకుల మిచ్చిరి, రాగి లడ్డు తయారు చేసి చూపించారు. డిస్ప్లే లో ఏర్పాటు చేసిన జంక్ ఫుడ్ వద్దు ఇంటి ఫుడ్ ముద్దు అన్న నినాదాలు అక్కడ, లబ్ధిదారులను ఆకట్టుకున్నాయి. అక్కడ వచ్చిన లబ్ధిదారులకు ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కార్యకర్తలు పోయి వెంకటలక్ష్మి, పి చిన్నారి, ఆయాలు కర్రీ సత్యవతి, సిహెచ్ రాజేశ్వరి పిల్లలు తల్లిదండ్రులు, గర్భవతులు, బాలింతలు, తదితరులు పాల్గొన్నారు.

## ఓటరు జాబితాల స్వచ్ఛీకరణకు సహకరించాలి





కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్

**కాకినాడ, పెన్ పవర్,ఏప్రిల్ 15:** జిల్లాలో నిర్వహించనున్న స్పెషల్ ఇంటెన్సీవ్ రివిజన్ (ఎస్ఐఆర్)-2026 ప్రక్రియకు రాజకీయ పార్టీలు సహాయ సహకారాలు అందించాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ కోరారు.బుధవారం కలెక్టరేట్ కోర్ట్ హాలులో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించిన ఆయన, ఎస్ఐఆర్-2026, పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ అంశాలపై వివరించారు. ఎన్నికల కమిషన్, రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు ఓటరు జాబితాల స్వచ్ఛీకరణ లక్ష్యంగా ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు.ఈ ప్రక్రియలో యునీక్ ఎన్యూమరేషన్ ఫారమ్స్ ద్వారా ఇప్పటికే నమోదైన ఓటర్ల వివరాలను ఎఐఆర్-2002 డేటాతో, వారి లేదా వారి బంధువుల వివరాలతో సరిపోల్చి (మ్యాచింగ్/లింకింగ్) అర్హులు, అనర్హులను నిర్ధారించి ఓటరు జాబితాలను సవరించనున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా రాజకీయ పార్టీల ప్రతినిధుల సందేహాలను కూడా నివృత్తి చేశారు.జిల్లాలో ప్రస్తుతం 1640 పోలింగ్ కేంద్రాలు ఉండగా, రేషనలైజేషన్ అనంతరం వీటి సంఖ్యను 1825కు పెంచేందుకు ప్రతిపాదించినట్లు తెలిపారు. అందులో భాగంగా 81 కేంద్రాలకు స్థానం మార్పులు, 275 కేంద్రాలకు పేరు మార్పులు ప్రతిపాదించామని పేర్కొన్నారు.ఎన్నికల కమిషన్ సూచనల మేరకు ప్రతి పోలింగ్ కేంద్ర పరిధిలో బూత్ లెవెల్ ఏజెంట్లను నియమించాలని రాజకీయ పార్టీల ప్రతినిధులను కలెక్టర్ కోరారు.

ఈ సమావేశంలో డిఆర్ఓ డి.తిప్పేనాయక్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు నరాల శివ (ఆప్), ఎస్. అప్పారావు (బీఎస్పీ), సిహెచ్. రమేష్ బాబు (బీజేపీ), కె. ప్రసాద్ (సిపిఐ-ఎం), పోలిశెట్టి శ్రీనివాస్ (ఐఎన్సీ), గదుల సాయిబాబా (టిడిపి), ఆర్. వెంకటేశ్వరరావు (వైఎస్ఆర్సీపీ), అడబాల సత్యన్నారాయణ (జనసేన), అలాగే ఎలక్షన్ సూపరింటెండెంట్ ఎం. జగన్నాధం తదితరులు పాల్గొన్నారు.

## -ఇంటర్ ప్రథమ సంవత్సరంలో సత్తా చాటిన ఎస్ వి ఎస్ విద్యార్థులు.



- తొలి ఏడాదే జిల్లాలో మొదటి స్థానం.
- విద్యార్థిని అభినందించిన మాజీ మంత్రి ముద్రగడ.

**కిర్లంపూడి/ప్రత్తిపాడు, పెన్ పవర్ ఏప్రియల్, 15:** ఇంటర్మీడియట్ బోర్డ్ విడుదల చేసిన పరీక్షా ఫలితాలలో ప్రత్తిపాడుకు చెందిన ఎస్వీఎస్ కళాశాల మొదటి సంవత్సర విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు.బావిశెట్టి కొండలరావు సారథ్యంలో కరస్పాండెంట్ బావిశెట్టి శ్వేత, భావిశెట్టి వెంకటరమణలు గత ఏడది స్థాపించిన ఎస్వీఎస్ కళాశాల కళాశాల నుండి 50 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 48 మంది విద్యార్థులు ఉత్తమ ఫలితాలతో ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు.కళాశాల స్థాపించిన మొదటి సంవత్సరమే 98% శాతం ఉత్తీర్ణత పొందడం పట్ల విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ బావిశెట్టి శ్వేత అభినందించారు. తమ పాఠశాల నుండి ముద్రగడ జోస్న 470కి 466 మార్కులు సాధించి కాకినాడ జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిందని ఆమె తెలిపారు.465 మార్కులతో కె రాజేష్, 464 మార్కులతో కె వీర రాఘవ,464 మార్కులతో జి షిరివర్షిణి మూడో స్థానంలో నిలువుగా బైపిసి విభాగంలో వి సత్య శ్రీ 444 మార్కులతో ప్రథమ స్థానంలో ఉత్తీర్ణత సాధించారని చెప్పారు. ఈ సందర్భంగా ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను కళాశాల ఉపాధ్యాయులతో పాటు ఆయా విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు. జిల్లా మొదటి స్థానంలో రాణించిన విద్యార్థిని ముద్రగడ జోస్న ను మాజీ మంత్రి రాష్ట్ర వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సభ్యులు ముద్రగడ పద్మనాభం అభినందించారు.

## గాయపడిన వ్యక్తికి మంత్రి సుభాష్ మానవత్వపు చేయూత



రూ.10 వేలు చెక్కు ఆర్థిక సహాయం

**రామచంద్రపురం, పెన్ పవర్,ఏప్రిల్ 15:** సైకిల్ ప్రమాదంలో గాయపడి రామచంద్రపురం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తికి కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ మానవత్వంతో ముందుకొచ్చి రూ.10 వేల ఆర్థిక సహాయం అందించారు. రామచంద్రపురం నియోజకవర్గం కె.గంగవరం మండలం బట్లపాలిక గ్రామపంచాయతీ పరిధిలోని తర్లపూడి గ్రామానికి చెందిన కాలా వెంకట్రావు సైకిల్ తొక్కుతూ ప్రమాదవశాత్తు కిందపడడంతో గాయపడ్డారు. ఈ విషయాన్ని కూటమి పార్టీ నాయకుడు కాటే సుబ్రహ్మణ్యం మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.దీనిపై వెంటనే స్పందించిన మంత్రి సుభాష్ రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి వెళ్లి గాయపడిన వెంకట్రావును పరామర్శించారు. అనంతరం రూ.10,000 విలువైన చెక్కును ఆర్థిక సహాయంగా అందజేశారు.మంత్రి సుభాష్ చూపిన మానవత్వంపై బాధిత కుటుంబ సభ్యులు, కూటమి పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

# జిల్లా స్థాయి వాలీబాల్ పోటీల్లో కిర్లంపూడి జట్టుకు మొదటి స్థానం కైవసం.





**కిర్లంపూడి/ప్రత్తిపాడు,15:** కాకినాడ జిల్లా నియోజకవర్గ కేంద్రమైన పత్తిపాడులో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135వ జయంతి వేడుకలను పురస్కరించుకుని నిర్వహించిన జిల్లా స్థాయి వాలీబాల్ పోటీల్లో కిర్లంపూడి జట్టు మొదటి బహుమతి కైవసం చేసుకుంది.ద్వితీయ బహుమతి, తుని జట్టు, తృతీయ బహుమతి యశోద యూత్ జట్టు కైవసం చేసుకున్నారు. మొదటి బహుమతి మెమెంటో తోపాటు 15000 రూపాయలు నగదు బహుమతిని ప్రత్తిపాడు మాజీ సర్పంచ్ గుడాల వెంకటరత్నం అందించారు. ద్వితీయ బహుమతి మెమెంటోతోపాటు 10000 రూపాయలు నగదు బహుమతిని రెవరెండ్ మసా ఇమ్మనియేల్, జాన్ సోదరులు అందించారు. తృతీయ బహుమతి మేమేంటోతోపాటు 8000 రూపాయలు నగదు బహుమతిని గుడాల సుందరరావు మాస్టర్ అందించారు.బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమానికి ప్రత్తిపాడు ఎంపీపీ గోళ్ళ క్రాంతి సుధాకర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గోళ్ళ క్రాంతి సుధాకర్ మాట్లాడుతూ నేటి విద్యార్థులు చదువుతోపాటు క్రీడలపట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. మానసిక వికాసానికి, శారీరిక దారుఢ్యానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయన్నారు. వాలీబాల్ పోటీల్లో విజేతలకు నగదు బహుమతి సమకూర్చిన పలువురితోపాటు, టోర్నమెంట్ ఆర్గనైజర్ గా వ్యవహరించిన గంజి ప్రభంజన్ ను ఎంపీపీ అభినందించారు.ఈ కార్యక్రమంలో గుర్రాల సత్యనారాయణ,మురా సత్యనారాయణ వరప్రసాద్,తోపాటు కిర్లంపూడి జట్టు కెప్టెన్ బత్తిన నాని (ప్రదీప్ )వైస్ కెప్టెన్ నందికళ్ల రమణ, జట్టు సభ్యులు యాగ్గాడ రాంబాబు, మురా సహదేవుడు, బర్రే చంద్ర, పందుగుల సూరి, పురంశెట్టి సురేష్, చెవల చరణ్ తేజ, కిర్లంపూడి జట్టు కోచ్ లు సాదే అనిల్ కుమార్,సీకోలు వెంకటరమణ పలువురు క్రీడాకారులు,క్రీడా అభిమానులు గ్రామస్తులు పాల్గొన్నారు.

02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పో. 12 సెం.మీ. వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# రూ.75.75 లక్షలతో ఆధునిక అగ్నిమాపక వాహనం ప్రారంభం

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: మంత్రి సుభాష్





**రామచంద్రపురం, పెన్ పవర్,ఏప్రిల్ 15:** అగ్నిప్రమాదాల సమయంలో వేగంగా స్పందించి ప్రాణాలు, ఆస్తులను రక్షించేందుకు రాష్ట్ర విపత్తు స్పందన, అగ్నిమాపక శాఖ ఏర్పాటు చేసిన రూ.75.75 లక్షల వ్యయంతో కూడిన అడ్వాన్స్ ఫైర్ టెండర్ వాహనాన్ని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ బుధవారం జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం నూతన వాహనాన్ని స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అగ్నిప్రమాదాల నివారణలో అగ్నిమాపక సిబ్బంది పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. ఈ ఆధునిక వాహనం ద్వారా 105 గ్రామాలకు అగ్నిమాపక సేవలు మరింత సమర్థవంతంగా అందుబాటులోకి వస్తాయని తెలిపారు. వాహనంలో హై ప్రెజర్ పంపు, 360 డిగ్రీల మానిటర్, హైడ్రాలిక్ టూల్స్ వంటి ఆధునిక పరికరాలతో పాటు హోసులు, లాడర్లు, కట్టర్లు, డ్రిల్ మెషీన్లు వంటి అత్యవసర సామగ్రి సమకూర్చినట్లు వివరించారు.షార్ట్ సర్క్యూట్లు, గ్యాస్ లీకేజీలు, ఫ్యాక్టరీ మరియు రోడ్డు ప్రమాదాల వంటి అత్యవసర పరిస్థితుల్లో వేగంగా స్పందించేందుకు ఈ వాహనం ఎంతో ఉపయోగపడుతుందని మంత్రి చెప్పారు.ఏప్రిల్ 14 నుండి 20 వరకు నిర్వహిస్తున్న అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా ప్రజల్లో అవగాహన పెంపొందించడం అవసరమని సూచించారు.అలాగే అగ్నిప్రమాదాల నివారణకు ప్రజలు ఎలక్ట్రిక్ లైన్లు, గ్యాస్ సిలిండర్లు, పెట్రోలు పదార్థాలు, ఎల్పీజీ స్టౌలు, వెల్డింగ్ పనులు, పటాకులు వాడకంలో జాగ్రత్తలు పాటించాలని మంత్రి సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి ఎన్. పార్థసారథి, రామచంద్రపురం ఫైర్ అధికారి కె. వెంకటరెడ్డి, ముమ్మిడివరం ఫైర్ అధికారి ఎస్. నాగేశ్వరరావు, జనసేన ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, పట్టణ టిడిపి అధ్యక్షుడు ఉండవెల్లి శివ, ఉపాధ్యక్షుడు చందమామ వాసు తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్ ఫలితాల్లో విజయ దుందుభి

**కాజులూరు, పెన్ పవర్,ఏప్రిల్ 15:** నేడు విడుదలైన ఇంటర్మీడియట్ ఫలితాల్లో కాజులూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి విజయ దుందుభి మోగించారు. ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో మొత్తం 82 మంది విద్యార్థులలో 45 మంది ఉత్తీర్ణత సాధించి 55 శాతం ఫలితాన్ని నమోదు చేశారు.ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో కట్టా శిరీష (బైపీసీ) 967/1000 మార్కులతో ప్రథమ స్థానం సాధించగా, జక్కిన జ్యోతి (బైపీసీ) 960/1000 మార్కులతో ద్వితీయ స్థానం పొందారు. ఎంపీసీ విభాగంలో ఏళ్ల తనూజ 955/1000 మార్కులతో ప్రథమ స్థానం సాధించగా, టేకుమూడి శృతి 944/1000 మార్కులతో ద్వితీయ స్థానం దక్కించుకున్నారు.సీఈసీ విభాగంలో పెంకే భానుప్రియ 914/1000 మార్కులతో ప్రథమ స్థానం సాధించగా, హెచ్ఈసీ విభాగంలో షేక్ తానీషా 897/1000 మార్కులతో ప్రథమ స్థానం పొందారు.అదేవిధంగా ప్రథమ సంవత్సరం ఫలితాల్లో బైపీసీ విభాగానికి చెందిన మేరేటి గీతా శివ సాయి లక్ష్మి 450/455 మార్కులతో ప్రథమ స్థానం సాధించగా, ఎంపీసీ విభాగంలో అన్యం సిరి లక్ష్మి 454/470 మార్కులతో ప్రథమ స్థానం పొందారు.ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.ఎస్. శ్రీనివాస్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది మరియు గ్రామస్తులు అభినందించారు.

# కొత్తపేటలో అన్నా క్యాంటీన్ ప్రారంభం -- పేదలకు పట్టెడన్నమే లక్ష్యం: ఎమ్మెల్యే బండారు





**కొత్తపేట ,పెన్ పవర్,ఏప్రిల్15:** పేద ప్రజలకు తక్కువ ధరకే నాణ్యమైన ఆహారం అందించాలనే ఉద్దేశంతో కొత్తపేటలో అన్నా క్యాంటీన్‌ను బుధవారం ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఘనంగా ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ రెడ్డి అనంత కుమారి, వాడపల్లి దేవస్థానం చైర్మన్ ముదునూరి వెంకటరాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ పల్లి మంగాదేవి భీమారావు, వైస్ చైర్మన్ కంఠంశెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.ముందుగా అన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదవారికి పట్టెడన్నం పెట్టడమే కూటమి ప్రభుత్వ ప్రధాన సంకల్పమని తెలిపారు.స్వర్గీయ ఎన్టీఆర్ ఆవిష్కరించిన సంక్షేమ భావజాలాన్ని కొనసాగిస్తూ రూ.5కే అల్పాహారం,మధ్యాహ్నం,సాయంత్రం భోజనం అందిస్తున్నామని చెప్పారు.రాష్ట్రవ్యాప్తంగా వందలాది అన్నా క్యాంటీన్లు పనిచేస్తూ రోజూ లక్షల మందికి ఆహారం అందిస్తున్నాయని వివరించారు.

గతంలో నిలిచిపోయిన క్యాంటీన్లను ఎన్డీఏ కూటమి ప్రభుత్వం తిరిగి ప్రారంభించిందని,ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో సంక్షేమ కార్యక్రమాలు వేగంగా అమలవుతున్నాయని అన్నారు. కొత్తపేటలో హాస్పిటల్స్, బస్టాండ్, ప్రభుత్వ కార్యాలయాల సమీపంలో క్యాంటీన్ ఏర్పాటు చేయడం ప్రజలకు ఎంతో సౌకర్యంగా ఉంటుందని తెలిపారు.

రావులపాలెంలో కూడా త్వరలో అన్నా క్యాంటీన్ ప్రారంభించేందుకు ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్వయంగా భోజనం వడ్డించి ప్రజలతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, అధికారులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడిగా రెడ్డి సుబ్రహ్మణ్యం నియామకం



**అమరావతి/కొత్తపేట,పెన్ పవర్, ఏప్రిల్15;** తెలుగుదేశం పార్టీ జాతీయ కమిటీ పునర్వ్యవస్థీకరణలో భాగంగా కీలక నియామకాలు చేపట్టిన పార్టీ అధిష్టానం, అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేటకు చెందిన సీనియర్ నాయకుడు రెడ్డి సుబ్రహ్మణ్యాన్ని జాతీయ ఉపాధ్యక్షుడిగా నియమించింది. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం అధికారిక ప్రకటన విడుదల చేసింది. ఇదే సమయంలో యువ నాయకుడు నారా లోకేష్‌ను టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమించడం ప్రాధాన్యత సంతరించుకుంది.రెడ్డి సుబ్రహ్మణ్యం నాలుగు దశాబ్దాలకుపైగా రాజకీయ అనుభవం కలిగిన నాయకుడు. జిల్లా ఉపాధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వంటి పలు కీలక పదవులను నిర్వహించారు. ఉమ్మడి రాష్ట్రంలో బీసీ సెల్ అధ్యక్షుడిగా, పొలిట్‌బ్యూరో సభ్యుడిగా కూడా సేవలందించారు. అట్టడుగు స్థాయి నుంచి ఎదిగి కార్యకర్తలకు సన్నిహితంగా మెలుగుతున్న నాయకుడిగా గుర్తింపు పొందారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు, వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ఇది పదవి కాదు, బాధ్యత. పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తాను అని స్పష్టం చేశారు. పార్టీని క్షేత్రస్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు మరింత బలోపేతం చేయడమే తన లక్ష్యమని పేర్కొన్నారు. తన నియామకంపై శుభాకాంక్షలు తెలిపిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

## యల్లపు దొరబాబుకు తుమ్మలపల్లి రమేష్ పరామర్శ.



**కిర్లంపూడి, పెన్ పవర్, ఏప్రియల్, 15**: కాకినాడ జిల్లా కిర్లంపూడి గ్రామానికి చెందిన జనసేన పార్టీ నాయకులు యల్లపు దొరబాబుకు జగ్గంపేట నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ పరామర్శించారు. యల్లపు దొరబాబు ఇటీవల అనారోగ్యానికి గురై కాకినాడ ఒక ప్రయివేట్ హాస్పిటల్ లో చికిత్స అనంతరం ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న జగ్గంపేట నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ బుధవారం దొరబాబును పరామర్శించి ఆరోగ్య పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు గంధం ప్రభాకర్, చిక్కాల భగవాన్, మాదావరపు వీరబాబు, పాలెం బాబీ తదితరులు ఉన్నారు

## భారత జనగణన--2027కు సన్నాహాలు ప్రారంభం




**కాకినాడ, పెన్ పవర్,ఏప్రిల్ 15:** భారత దేశంలో 2027 జనాభా గణనను అత్యంత ప్రాముఖ్యంతో నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం సన్నాహాలు ప్రారంభించిందని కాజులూరు తహశీల్దార్ జి.ఆర్.ఠాగూర్ తెలిపారు. ఈ నేపథ్యంలో జిల్లాలో రెండు దశల్లో జనగణన చేపట్టనున్నట్లు అధికారులు వెల్లడించారు.మొదటి దశగా గృహ జాబితా మరియు గృహ గణన కార్యక్రమం 2026 మే 1 నుండి మే 30 వరకు నిర్వహించబడనుంది. రెండవ దశగా జనాభా గణన 2027 ఫిబ్రవరి 9 నుండి ఫిబ్రవరి 28 వరకు జరగనుంది. ఈ ప్రక్రియలో భాగంగా ప్రజలు స్వయంగా తమ వివరాలను నమోదు చేసుకునే విధంగా "సెల్ఫ్ ఎన్యూమరేషన్" సదుపాయాన్ని ప్రభుత్వం కల్పించింది. ఇందుకోసం ఏప్రిల్ 16 నుండి 30 వరకు ప్రత్యేక అవకాశం కల్పించబడింది. ప్రజలు హ్ట్రజూం://ఒవ.ఎవఅంబం.గ్రశీజ.ఱఅ?? పోర్టల్ ద్వారా తమ వివరాలను నమోదు చేసుకోవచ్చు.పోర్టల్‌లో నమోదు సమయంలో వివరాలను ఒకసారి పరిశీలించి (ప్రీవ్యూ) అనంతరం సబ్మిట్ చేయాల్సి ఉంటుంది. నమోదు పూర్తయిన తర్వాత (సెల్ఫ్ అన్యుమరేషన్ ఐడి) ఉత్పత్తి అవుతుంది. ఈ ఐడీ ద్వారా నమోదు వివరాలను సెన్సస్ సిబ్బంది ధృవీకరించనున్నారు.ప్రజలు తమ వివరాలను సరైన రీతిలో నమోదు చేయాలని, అవసరమైన పత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని అధికారులు సూచించారు. ఈ ప్రక్రియ విజయవంతం కావాలంటే ప్రతి ఒక్కరూ సహకరించాలని తహశీల్దార్ ఠాగూర్ విజ్ఞప్తి చేశారు.

# అంబేడ్కర్ కి ఘన నివాళులు




**జగ్గంపేట, పెన్ పవర్, ఏప్రిల్ 15:** అంబేద్కర్ జయంతి ఉత్సవాలు సందర్భంగా జగ్గంపేట పరివర్తన స్థలంలో అంబేద్కర్ విగ్రహానికి జగ్గంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు డాక్టర్ టి వి ఎస్ రంగారావు మాట్లాడుతూ అంబేద్కర్ దేశానికి రాజ్యాంగాన్ని అందించడంతో పాటు సమానత్వం, సామాజిక న్యాయం, మానవ హక్కులు, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం విశేషంగా కృషి చేసిన మహనీయుడని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దాడి బాబురావు, డి.పద్మావతి, చిన్న, వరప్రసాద్, బాషారుద్దీన్, బంగారయ్య, ఎం.విజయలక్ష్మి, నాగమణి జి.కనకదుర్గ, వాణి, చిన్న పాప, గంగ భవాని, సత్యఉమాలక్ష్మి, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

## జగ్గంపేటలో ప్రభుత్వ అన్న క్యాంటీన్ ప్రారంభం

- ప్రారంభించిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ





**జగ్గంపేట, పెన్ పవర్, ఏప్రిల్ 15:** స్థానిక గోకవరం రోడ్డులో పంచాయతీరాజ్ అతిథి గృహం వద్ద ప్రభుత్వం ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్ బుధవారం జగ్గంపేట ఎమ్మెల్యే, తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి సభ్యులు జ్యోతుల నెహ్రూ ప్రారంభించారు. ఆర్యవైశ్య డైరెక్టర్ కొత్త కొండబాబు 600 మందికి ఐదు రూపాయల భోజనం టికెట్స్ తీసుకుని వచ్చిన వారందరికీ భోజనం అందించారు. ఈ సందర్భంగా జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ అన్న నందమూరి తారకరామారావు నుండి ముఖ్యమంత్రి చంద్రబాబు వరకు పేదల ఆకలి తీర్చేందుకు తెలుగుదేశం పార్టీ పనిచేస్తుందని నిరూపించారన్నారు. కూడు గుడ్డ నీడ నినాదంతో టిడిపిని ప్రారంభించుకున్నామని 2014 నుండి 2019 వరకు చంద్రబాబు ఐదు రూపాయలకే టిఫిను భోజనం, ఇలా మూడు పూటలా అందించేందుకు అన్నా క్యాంటీన్ ఏర్పాటు చేస్తే తర్వాత వచ్చిన జగన్ ప్రభుత్వం వాటిని రద్దు చేయడం జరిగిందన్నారు. అప్పుడు జగ్గంపేటలో టిడిపి నాయకులు, కార్యకర్తలు సహకారంతో ఐదు సంవత్సరాల పాటు ప్రతి సోమవారం 500 మందికి ఉచిత భోజనం నిర్వహించామని ఇప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబు జగ్గంపేటకు అన్నా క్యాంటీన్ మంజూరు చేయటంతో పేదలకు ఐదు రూపాయలకే భోజనం దొరుకుతుందని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఏప్రిల్ 22న లెనిన్ 156వ జయంతిని రాష్ట్రవ్యాప్తంగా జరుపుకుందాం



**జగ్గంపేట, పెన్ పవర్, ఏప్రిల్ 15:** ఇరాన్ పై అమెరికా ఇజ్రాయిల్ యుద్దోన్మాదాన్ని నిరసిస్తూ ఏప్రిల్ 22న విప్లవ మహోపాధ్యాయుడు విఐ లెనిన్ 156వ జయంతిని రాష్ట్రవ్యాప్తంగా, గ్రామ గ్రామాన జరుపుకోవాలని పిలుపునిస్తూ ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం, ఏ ఐ ఎఫ్ టి యు, పి ఓ డబ్ల్యు స్త్రీ విముక్తి, పి డి యస్ యు విజృంభణ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో బుధవారం జగ్గంపేట మండలం రామవరం గ్రామం రంగవల్లి నగర్ లో కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు మాట్లాడుతూ రెండు వినాశకర ప్రపంచ యుద్ధాల దుర్మార్గాలను, అమెరికా అణుబాంబు ప్రయోగాలను కల్లారా చూడలేని మూడు తరాలకు చెందిన ప్రపంచ ప్రజలంతా నేడు ఇరాన్ పై అమెరికా సామ్రాజ్యవాదులు- ఇజ్రాయిల్ దుష్ట కూటమి కలిసి చేస్తున్న యుద్దోన్మాద చర్యలను దృశ్య మాధ్యమాల్లో చూస్తున్నాం, కారణాలను,విశ్లేషణలను వింటున్నాం. సామ్రాజ్య వాద యుగంలో ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు సంబంధం లేని ఏ దేశ ఆర్థిక వ్యవస్థ కూడా ఒంటరిగా మనుగడ సాధించలేదని, ఇరాన్ పై యుద్ధం తరువాత జరుగుతున్న పరిణామాలు మనకు స్పష్టం చేస్తున్నాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్యు (వి )రాష్ట్ర కార్యదర్శి కే.సతీష్, ఏపీ రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు కే.రామలింగేశ్వర రావు, పిఓడబ్ల్యూ స్త్రీ విముక్తి జిల్లా నాయకులు రెడ్డి దుర్గాదేవి, యమునా, కొండేపూడి మంగయమ్మ, రంగవల్లి నగర్ వాసులు దుర్గబాబు, వీరబాబు, దేవి, సూర్యకళ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి యనమల రామకృష్ణుడును పరామర్శించిన ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా.



**కిర్లంపూడి/ప్రత్తిపాడు,, పెన్ పవర్, ఏప్రియల్,15:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక శాఖ మాజీ మంత్రి, సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకులు యనమల రామకృష్ణుడును ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా బుధవారం పరామర్శించారు. యనమల రామకృష్ణుడు ఇటీవల గుండెకు స్టంట్ వేయించుకుని హైదరాబాదులోని జూబ్లీహిల్స్ లోని వారి ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు.విషయం తెలుసుకున్న వరుపుల సత్యప్రభరాజా వారి ఇంటికి వెళ్లి యనమల రామకృష్ణుడును పరామర్శించి ఆయన ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా పూర్తి ఆరోగ్యంతో త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

## కొత్తపేట ఆసుపత్రి అభివృద్ధి పనులకు శ్రీకారం -- వంద పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ లక్ష్యం






**కొత్తపేట,పెన్ పవర్, ఏప్రిల్15:** కొత్తపేట ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను పేద, మధ్యతరగతి ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందించేలా అభివృద్ధి చేయడం లక్ష్యమని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తెలిపారు. బుధవారం ఆయన సుమారు రూ.50 లక్షల వ్యయంతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆసుపత్రిలో పురుష, స్త్రీల వార్డులకు సీలింగ్ ఏర్పాటు చేసి నూతన ఫ్యాన్లు అమర్చారు. మరుగుదొడ్లలో పాడైన ప్లంబింగ్ వ్యవస్థను తొలగించి ఆధునిక సదుపాయాలతో పునర్నిర్మించారు. రోగుల కోసం మంచాలు, పరుపులు మార్చి, చిన్నపిల్లల వార్డులో బేబీ వార్మర్స్ ఏర్పాటు చేశారు. పాత కిటికీల స్థానంలో యూపీవీసీ విండోలు అమర్చగా, వేసవిని దృష్టిలో ఉంచుకుని మూడు వాటర్ కూలర్లు ఏర్పాటు చేశారు. ఆసుపత్రి పరిసరాల్లో పచ్చదనం పెంచేందుకు మొక్కలు నాటడంతో పాటు డ్రైనేజీ వ్యవస్థను అండర్‌గ్రౌండ్‌గా మార్పులు చేశారు.ఆసుపత్రి పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. తన స్వంత నిధులతో రూ.7 లక్షలతో ఆసుపత్రి ముందు షెల్టర్ నిర్మించినట్లు తెలిపారు. భవిష్యత్తులో ఆసుపత్రిని వంద పడకలుగా అప్‌గ్రేడ్ చేయడానికి కృషి కొనసాగిస్తామని వెల్లడించారు. వైద్యులు, అభివృద్ధి కమిటీ సభ్యుల సేవలను అభినందించారు.

## ఏలేశ్వరం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల కళాశాల ఇంటర్ ఫలితాల్లో హవా.




**ఏలేశ్వరం, పెన్ పవర్, ఏప్రిల్ 15:**నగర పంచాయతీలో గల డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల కళాశాల నందు విద్యార్థులు ఇంటర్ ఫలితాలలో సత్తా చాటుకున్నారు. మొత్తం 61 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 59 మంది విద్యార్థినిలు ఉత్తీర్ణత సాధించారు. వివరాల్లోకి వెళితే

బైపిసి విభాగంలో బి కావ్య 974 మార్కులతో కళాశాలలో ప్రథమ స్థానంలో నిలిచింది. 952 మార్కులతో యు అనిత ద్వితీయ స్థానంలో నిలిచింది. అలాగే ఎంపీసీ విభాగంలో బి దేని నాగ సాయి శ్రీ 957 మార్కులతో ప్రథమ స్థానంలో నిలవగా, ఎం సత్య 920 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచింది.ఇంటర్ ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థినులకు కళాశాల ప్రిన్సిపాల్ చంద్ర శారద తోపాటు అధ్యాపకులు అభినందించారు. ఇంటర్ పూర్తి చేసుకుని ఉన్నత చదువులకి వెళ్ళనున్న విద్యార్థినులు ఉత్తమ విద్యను అభ్యసిస్తూ ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. మంచి ఫలితాలు సాధించినందుకు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల కళాశాల విద్యార్థులను, అధ్యాపకులను పలువురు ప్రముఖులు అభినందించారు.

## డొక్కా సీతమ్మను ఆదర్శంగా కోనసీమ ఆహార నిధి





**అంబాజీపేట, పెన్ పవర్, ఏప్రిల్ 15:**కోనసీమలో ఉన్న డొక్కా సీతమ్మను ఆదర్శంగా తీసుకుని పేదల అన్నార్తిని తీరుస్తున్న ఆహార నిధి చైర్మన్ వీరంశెట్టి సతీష్ సేవా గుణాన్ని పి. గన్నవరం ఎమ్మెల్యే కొనియాడారు.

ఇరుసుమండలో ఉన్న కోనసీమ ఆహార నిధి వార్షికోత్సవాన్ని జరిగింది. చైర్మన్ వీరంశెట్టి సతీష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే సత్యనారాయణ ముఖ్యఅతిధిగా మాట్లాడుతూ కోనసీమలో ఉన్న డొక్కా సీతమ్మను ఆదర్శంగా తీసుకుని పేదల అన్నార్తిని తీరుస్తున్నానని ఇందుకు స్నేహితుల బృంధం సమాజ సేవ చేయాలనే ఆలోచన గొప్ప విషయమన్నారు. ఆహర నిధి సతీష్ మాట్లాడుతూ ఇంత వరకు తాను అందరి సహకారంతో ఆహార నిధిని 8 సంవత్సరాలు పూర్తి చేసుకున్నానన్నారు. విద్యా, వైద్యం తదితర కార్యక్రమాల ప్రాధన్యతగా సేవా కార్యక్రమాలు చేస్తున్నారన్నారు. కోనసీమలో ఉన్న డొక్కా సీతమ్మను ఆదర్శంగా తీసుకుని పేదల అన్నార్తిని తీరుస్తున్నానని ఇందుకు స్నేహితుల బృంధం ఎంతగానో సాయపడుతుందన్నారు. కోనసీమ ఆహార నిధి గౌరవ అధ్యక్షుడు కల్వకొలను తాతాజీ మాట్లాడుతూ ఇలాంటి సేవా కార్యక్రమాలను యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఉచిత కంటి వైద్య శిబిరం, రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. అనంతరం ప్రజాప్రతినిధులను, గ్రామస్తులను మెమోంటోలతో సత్కరించారు. కార్యక్రమంలో అక్కిశెట్టి పెద్ద, ఆకుల చంటి, మైపాల తాతాజీ, జల్లి బాలరాజు, తదితరులు పాల్గొన్నారు.

## అసలే వేసవికాలం వృధా అవుతున్న త్రాగునీరు.. ఆందోళన చెందుతున్న గ్రామస్తులు..





**అడ్డతీగల, పెన్ పవర్, ఏప్రియల్15:** అడ్డతీగల మండలం వెదురునగరం గ్రామంలో త్రాగునీటి కోసం ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంక్ శిధిలావస్థకు చేరుకుంది . అయితే అసలే వేసవికాలం కావడంతో వాటర్ ట్యాంక్ లో నింపుతున్న నీరు మొత్తం నేల పాలవుతుందని, త్రాగునీరు కన్నా వృధా అవుతున్న నీరే ఎక్కువ అని గ్రామస్తులు వాపోతున్నారు. దీనికి కారణం వాటర్ ట్యాంక్ శిధిలావస్థకు చేరుకోవడమే నని, బురద కాలువలోకి పోతుందనిగ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ వేసవిలో కనీసం త్రాగునీరు లేకపోతే గ్రామమంతా ఇబ్బంది పడే అవకాశం ఉంటుందని, పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు . అసలే ఎండలు తీవ్ర రూపం దాల్చడంతో, ఇప్పటికైనా సంబంధిత అధికారులు మరమ్మతులు నిర్వహిస్తే బాగుంటుందని, లేకుంటే త్రాగునీటి అవసరాలకు వేరే మార్గమైన ఆలోచించాలని గ్రామస్తులు తెలిపారు.

## అంబేద్కర్ జయంతి సందర్భంగా వాదాలకుంట కొత్తపేటలో అన్న సమారాధన.




**గోపాలపురం, పెన్ పవర్, ఏప్రిల్ 15.** భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135వ జయంతిని పురస్కరించుకొని మండలంలోని వాదాలకుంట గ్రామంలో ఉన్న కొత్తపేటలో బుధవారం రాత్రి భారీ అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. అంబేద్కర్ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం కాలనీవాసుల సహాయ సహకారాలతో అంబేద్కర్ యూత్ సభ్యులు అన్న సమారాధన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం అన్న సమారాధన కార్యక్రమంలో పాల్గొని సంఘ సభ్యులు ఏర్పాటు చేసిన ఆహార పదార్థాలను ఆరగించారు. అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని ప్రతి ఏటా భారీ అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సేవా సంఘం సభ్యులతో పాటు కాలనీ పెద్దలు పాల్గొన్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District-533003
Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

# కాకినాడలో ఏఎస్పీ కార్యాలయం, ట్రాఫిక్-2 పీఎస్‌లలో...






**ఐజీ వార్షిక తనిఖీలు**

**కాకినాడ, పెన్ పవర్,ఏప్రిల్ 15:** ఏలూరు రేంజ్ ఐజీ జి.వి.జి అశోక్ కుమార్, ఐపీఎస్ బుధవారం వార్షిక తనిఖీలలో భాగంగా కాకినాడ ఏఎస్పీ కార్యాలయం మరియు ట్రాఫిక్-2 పోలీస్ స్టేషన్‌ను సందర్శించి రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. గ్రేవ్ కేసుల పురోగతిని సమీక్షిస్తూ ప్రాపర్టీ రికవరీ రేటును పెంచాలని సూచించారు. ఇందుకోసం క్షేత్రస్థాయి నుంచి పైస్థాయి వరకు సమన్వయంతో, నిబద్ధతతో పనిచేయాలని ఆదేశించారు.జిల్లాలో గంజాయి అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టాలని, 'ఈగల్ టీమ్' సాంకేతిక, క్షేత్రస్థాయి సహాయాన్ని వినియోగించి మరిన్ని కేసులు నమోదు చేయాలని స్పష్టం చేశారు.ట్రాఫిక్ నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారిస్తూ డ్రంకెన్ డ్రైవ్, ఈ-చాలన్ల అమలును సమీక్షించారు. నగరంలో ప్రమాదాల నివారణ లక్ష్యంగా ట్రాఫిక్ నియంత్రణపై నిఘా పెంచాలని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ తనిఖీ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ జి. బిందుమాధవ్, ఏఎస్పీ పాటిల్ దేవ్ రాజ్ మనీష్, ఎస్డీ డీఎస్పీ కె.వి.వి. సత్యనారాయణ తదితర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## భారీ జాబ్ మేళా పోస్టర్ ను ఆవిష్కరించిన కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్



**అమలాపురం/అంబాజీపేట, పెన్ పవర్, ఏప్రిల్ 15:**డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా యువతకు ఉపాధి అవకాశాలను విస్తృతంగా కల్పించే దిశగా జిల్లా పరిపాలన కీలక చర్యలు చేపడుతోంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, మరియు వికాస సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 18వ తేదీ న అమలాపురంలోని శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాల, భూపయ్య అగ్రహారం ప్రాంగణంలో భారీ జాబ్ మేళాను నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ జాబ్ మేళాకు సంబంధించిన గోడపత్రికను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,
జిల్లాలోని యువతీ యువకులు ప్రభుత్వంతో పాటు ప్రైవేట్ రంగం అందిస్తున్న ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకొని స్వయం సమృద్ధి సాధించాలని పిలుపునిచ్చారు. విద్య పూర్తయ్యాక నిరుద్యోగంగా ఉండకుండా, తమ ప్రతిభను చూపించి స్వయంగా నిలబడే దిశగా ఈ జాబ్ మేళా ఒక గొప్ప వేదికగా ఉపయోగపడుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ ఉద్యోగ మేళాలో సుమారు 15 ప్రముఖ కంపెనీలు పాల్గొననున్నాయని, దాదాపు 1300కు పైగా ఉద్యోగ అవకాశాలు అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ వెల్లడించారు. అర్హత కలిగిన యువత ముందస్తుగా సిద్ధమై, అవసరమైన ధృవపత్రాలతో హాజరై ఈ అవకాశాన్ని వినియోగించు కోవాలని సూచించారు. జిల్లా యువత అందరూ ఈ జాబ్ మేళాలో పాల్గొని తమ భవిష్యత్తుకు బలమైన అడుగులు వేయాలని జిల్లా కలెక్టర్ ఆకాంక్షించారు.
ఈ కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి డి. హరిశేషు, వికాస జిల్లా మేనేజర్ గోళ్ళ రమేష్, స్కిల్ డెవలప్మెంట్ ప్లేస్‌మెంట్ అధికారి కె. రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


## ఇంటర్మీడియట్ లో సత్తా చాటిన షిర్డీ సాయి విద్యార్థులు



**జిల్లాలో ప్రసిద్ధి చెందిన మహిళా కళాశాల**

**ఆలమూరు, పెన్ పవర్, ఏప్రిల్ 15;**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని ప్రసిద్ధి చెందిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం చెముడులంక శ్రీ షిర్డీ సాయి విద్యాసంస్థల వారి ఈశ్వర విద్యాలయ మహిళా జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించారు. ఆ విద్యా సంస్థల చైర్మన్ ఉమారాణి బుధవారం కళాశాల పరీక్ష ఫలితాలను వివరించారు. హ్యూమానిటీ గ్రూపు విభాగం జూనియర్ హెచ్ఇసి లో వాడపాలెం గ్రామానికి చెందిన ఎస్.సూర్య పల్లవి 500 మార్కులకు గాను 494 మార్కులతో రాష్ట్రంలో రెండో ర్యాంకును సాధించింది.అలాగే జూనియర్ ఎంపీసీ విభాగంలో పలివెల గ్రామానికి చెందిన డి.లలిత శైలు 465/470 సాధించగా హాజరైన వందమంది జూనియర్ ఎంపీసీ విద్యార్థులలో 464 పైన మార్కులు ముగ్గురు సాధించగా 463 పైన ఆరుగురు, 462 పైన పదిమంది, 461 పైన 12, 460 పైన 17 మంది ఉండగా 400 పైన మార్కులు 77 మంది సాధించారు. మ్యాథ్స్ లో నూటికి నూరు మార్కులు సాధించిన వారు 21 మంది ఉండడం విశేషం. అలాగే ఫిజిక్స్ లో 85 కి 85 మార్కులు సాధించివారు 42 మంది ఉండగా కెమిస్ట్రీలో కూడా 42 మంది 85 మార్కులు సాధించారు. ఇక జూనియర్ బైపిసి లో టి. పూజిత (కొత్తపేట),తోరాటి సువర్య దేవి(చొప్పెల్ల)లకు 450/455 మార్కులు సాధించారు. అలాగే సీనియర్ ఎంపీసీ విభాగంలో నర్సిపూడికి చెందిన ఎం. సీతా సంజన 989/1000 మార్కులు సాధించగా సీనియర్ బైపిసి విభాగంలో ఎం దుర్గా సుశీల 986/1000 మార్కులు సాధించారు.సీనియర్ హ్యూమానిటీ లో 978/1000 మార్కులు సాధించడం విశేషం. నూరు శాతం ఉత్తీర్ణత సాధించిన ఈ కళాశాలలో సీనియర్ ఎంపిపి పరోక్షలకు ఎనభై మంది హాజరు కాగా 900 పైగా మార్కులు సాధించిన వారు 56 మంది ఉన్నారు.అలాగే సీనియర్ బైపిసిలో 17 మంది విద్యార్థులకు గాను 12 మంది 900 దాటి మార్కులు సాధించారు. ఇక హచ్ఇజి లో 15 మందికి 14 మంది 900 దాటి మార్కులు సాధించినట్లు ఉమారాణి తెలిపారు. ఈ ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు అందుకు విద్యాబోధన చేసిన అధ్యాపకులకు ఆమె అభినందనలు తెలిపారు.

## ఇంటర్ ఫలితాల్లో పీఆర్ విద్యార్థులు అద్భుత ప్రతిభ



**కాకినాడ, పెన్ పవర్ ఏప్రిల్ 15:** బుధవారం విడుదలైన ఇంటర్మీడియట్ ఫలితాల్లో కాకినాడ పీ.ఆర్ ప్రభుత్వ వృత్తి విద్యా కళాశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయిలో అత్యధిక మార్కులు సాధించారు.ఎలక్ట్రానిక్స్ గ్రూప్‌కు చెందిన ద్వితీయ సంవత్సరం విద్యార్థిని బి. రూప ఆశ్రిత 992/1000 మార్కులు సాధించి విశేష ప్రతిభ కనబరిచారు. అలాగే ప్రథమ సంవత్సరం ఎలక్ట్రానిక్స్ విద్యార్థిని ఎస్. హర్షిత 488/500 మార్కులు సాధించి మెరుగైన ఫలితాన్ని నమోదు చేశారు. విద్యార్థుల ఈ విజయాలు కళాశాల ప్రతిష్టను మరింత పెంచాయని ప్రిన్సిపాల్ రాజేంద్ర ప్రసాద్ తెలిపారు.ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అధ్యాపకులు అభినందించారు.

## గ్రామ సంఘాల సహాయకులకు 5జీ స్మార్ట్ ఫోన్ల పంపిణీ ప్రారంభం



**కాకినాడ, పెన్ పవర్ ఏప్రిల్ 15:** స్వయం సహాయక సంఘాల ఆర్థిక వ్యవహారాల నిర్వహణను సాంకేతికంగా మరింత సమర్థవంతంగా చేయాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం గ్రామ సంఘాల సహాయకులకు (వివోఏ) 5జీ స్మార్ట్ ఫోన్లను మంజూరు చేసింది. ఈ నేపథ్యంలో కాకినాడ జిల్లాలో జిల్లా కలెక్టర్ బుధవారం 5జీ స్మార్ట్ ఫోన్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు.
స్వయం సహాయక సంఘాల కార్యకలాపాలు,ఆర్థిక లావాదేవీల నిర్వహణలో డిజిటల్ సౌకర్యాలను విస్తృతంగా వినియోగించేందుకు ఈ ఫోన్లు ఉపయోగపడనున్నాయి. గ్రామ స్థాయిలో సేవల సామర్థ్యాన్ని పెంచడంలో ఇవి కీలక పాత్ర పోషిస్తాయని అధికారులు తెలిపారు.
ఈ కార్యక్రమంలో పీడీ జి. శ్రీనివాసరావు, అడిషనల్ పీడీ జిలాని, డి.ఆర్.డి.ఏ --సెర్ప్ సిబ్బంది పాల్గొన్నారు.

## పోస్ట్ ఆఫీసులో పార్సిల్స్ ప్యాకింగ్ యూనిట్. ప్రారంభం



**అమలాపురం/అంబాజీపేట, పెన్ పవర్, ఏప్రిల్ 15:**అమలాపురం హెడ్ పోస్ట్ ఆఫీస్ లో నూతనంగా ఏర్పాటు చేసిన పార్సిల్ ప్యాకింగ్ యూనిట్ ను పోస్టల్ సూపరిండెంట్ శ్రీకర్ బాబు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీకర్ బాబు మాట్లాడుతూ పార్సిల్ ప్యాకింగ్ యూనిట్ ద్వారా అతి తక్కువ ఖర్చుతో కస్టమర్లు అందరూ తమ పార్సిల్స్ ను ప్యాకింగ్ తీసుకోవచ్చునన్నారు. ప్యాకింగ్ కు సంబంధించిన అన్ని సదుపాయాలు అమలాపురం హెడ్ పోస్ట్ ఆఫీస్ నందు అందుబాటులో ఉన్నాయని, ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో అమలాపురం అసిస్టెంట్ సూపరిండెంట్ కె శ్రీధరం , హెడ్ పోస్ట్ మాస్టర్ వెంకన్న, హెచ్ ఓ సిపి సి ఇంచార్జ్ ఏకాంబరం, తపాలా సిబ్బంది పాల్గొన్నారు.

# జల సంరక్షణ, ఉపాధి హామీ,పనులు వేగవంతం చేయాలి





**కలెక్టర్ హరేంధిర ప్రసాద్**

**కాకినాడ, పెన్ పవర్,ఏప్రిల్ 15:** జిల్లాలోని అన్ని ఆవాసాల్లో జల సంరక్షణ, ఉపాధి హామీ, పారిశుద్య పనులను ముమ్మరంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ ఎంపిడిఓలు, తహశీల్దారులు, పంచాయితీ స్పెషల్ అధికారులను ఆదేశించారు.బుధవారం కలెక్టరేట్ వివేకానంద సమావేశ హాలులో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జలధార--జలహారతి,ఉపాధి హామీ పథకం,శానిటేషన్,తాగునీరు, స్వచ్ఛాంధ్ర--స్వర్ణాంధ్ర, సచివాలయాల పనితీరు తదితర అంశాలపై ఆయన సమగ్రంగా ఆదేశాలు జారీ చేశారు. జలధార--జలహారతి కార్యక్రమం కింద గ్రామ పంచాయితీ వారీగా జల సంరక్షణ పనులను గుర్తించి,ఈ నెల 18లోపు ప్రతిపాదనలు సమర్పించాలని సూచించారు. ప్రతి మండలంలో ప్రాధాన్యత కలిగిన రెండు పనులను ఎంపిక చేయాలని,మెట్ట మండలాల్లో జల సంరక్షణ పనులు,డెల్టా ప్రాంతాల్లో ముంపు నివారణ,నీటి సరఫరా పనులను చేపట్టాలని తెలిపారు.90 రోజుల్లో ఈ పనులను ఉద్యమ స్థాయిలో నిర్వహించి భూగర్భ జలాలను పెంచాలని ఆకాంక్షించారు.ఉపాధి హామీ పథకం కింద ఏప్రిల్ నెలలో లక్షా 20 వేల పనిదినాల లక్ష్యాన్ని వచ్చే 15 రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలో చేపట్టిన 380 ఫామ్ పాండ్‌ల పనులను వర్షాకాలానికి ముందే పూర్తి చేయాలని సూచించారు. గోకులం షెడ్లు, ఎవెన్యూ, హార్టికల్చర్ ప్లాంటేషన్ పనులను వేగవంతం చేయాలని తెలిపారు.పంచాయితీల్లో ఇంటింటి చెత్త సేకరణను సమర్థ వంతంగా నిర్వహించి, చెత్త నుండి సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని, రాబోయే మూడు నెలల్లో పారిశుద్యంలో స్పష్టమైన మార్పు కనిపించేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. వర్షాలకుముందే డ్రెయిన్ల డిసిల్టింగ్ పూర్తి చేయాలని ఆదేశించారు.త్రాగునీటి సమస్యలు ఎక్కడైనా తలెత్తితే తక్షణం రవాణా ద్వారా నీటి సరఫరా చేయాలని, ట్యాంకులను క్లోరినేషన్ చేయాలని, నీటి నాణ్యతను పరీక్షించేందుకు ప్రతి పంచాయితీ వాటర్ టెస్ట్ కిట్లు కొనుగోలు చేయాలని సూచించారు. నీటి కాలుష్యం వల్ల అంటువ్యాధులు వస్తే తీవ్రంగా పరిగణిస్తామని హెచ్చరించారు.
పంచాయితీలలో పన్నుల వసూళ్లలో గ్రామ సచివాలయ సిబ్బందిని వినియోగించుకోవాలని, మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ సేవలపై ప్రజల్లో అవగాహన పెంచాలని తెలిపారు. ఈ నెల మూడవ శనివారం "వాటర్--పాజిటివ్ ఆంధ్ర" థీమ్‌తో స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు.ఈ సమావేశంలో జడ్‌పి సిఈఓ వివివిఎస్ లక్ష్మణరావు,డ్వామా పీడీ మధుసూధన్, కాకినాడ ఆర్డీఓ ఎస్.మల్లిబాబు, ఎంపిడిఓలు,తహశీల్దారులు, పంచాయితీ స్పెషల్ అధికారులు పాల్గొన్నారు.

# ఇంటర్ ఫలితాల్లో బీవీసీ అక్షర్ విద్యాసంస్థలు ప్రభంజనం..

**466 మార్కులు సాధించిన సాయి బాలాజీ**

**అమలాపురం/అంబాజీపేట, పెన్ పవర్, ఏప్రిల్ 15:**బుధవారం విడుదలైన ఇంటర్మీడియట్ పరీక్షాఫలితాల్లో బీవీసీ అక్షర్ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. అత్యధిక మార్కులతో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ప్రథమ స్థానం సాధించి విజయ పతాకాన్ని ఎగరవేశారు. మారిశెట్టి సాయి బాలాజీ 466 మార్కులు సాధించి జిల్లాలో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. అలాగే 465 మార్కుల పైన మరో ముగ్గురు విద్యార్థులు, 464 మార్కులు పైన ఏడుగురు విద్యార్థులు,460 మార్కులపైన 20 మంది విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలను సాధించినట్లు ఆ సంస్థల సెక్రటరీ, కరస్పాండెంట్ బోనం కృష్ణ సతీష్ తెలిపారు..
రాబోయే రోజుల్లో అడ్వాన్స్డ్, మెయిన్స్, యాప్సెట్ ల లోనూ అత్యుత్తమ ర్యాంకులు సాధిస్తారని ఎండి బోనం విజయలక్ష్మి ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీవీసీ సృష్టించిన పటిష్ట మైన ప్రోగ్రామ్‌లు, సరైన ప్రణాళిక, అగ్రశ్రేణి అధ్యాపకులతో శిక్షణ వంటి ప్రత్యేకతల వల్లే ఇంటర్మీడియేట్లో అన్ని సబ్జెక్ట్‌పై తమ విద్యార్థులు ఏకాగ్రతతో పట్టు సాధించి టాపర్స్‌గా నిలుస్తున్నారన్నారు. అధ్యాపక, అధ్యాపకేతర బృందాన్ని బీవీసీ అక్షర్ సంస్థల ప్రెసిడెంట్ బోనం కనకయ్య , వైస్ ప్రెసిడెంట్ బండిగుప్తాపు పాండురంగ , డీన్, ప్రిన్సిపాల్ అడబాల దుర్గారావు, హెచ్ఓడి లు జానకిరామ్ భీమన, రాజేశ్ కటకంలు అభినందించారు.



# సత్తెమ్మ తల్లి ఆశీస్సులు ప్రజలందరిపైనా ఉండాలి

★ విశాఖపట్నం పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే గణబాబు.



**కిర్లంపూడి, పెన్ పవర్, ఏప్రియల్ 15:** సత్తెమ్మ తల్లి ఆశీస్సులు ప్రజలందరిపైనా ఉండాలని విశాఖపట్నం పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే పెతకంశెట్టి (గణబాబు)పి జి వి ఆర్ నాయుడు అన్నారు. కాకినాడ జిల్లా మండల కేంద్రమైన కిర్లంపూడి ఉట్ల గుడిసె రామాలయం వీధిలో వేంచేసి యున్న సత్తెమ్మ తల్లి సంబరాల్లో గణబాబు ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్బంగా సత్తెమ్మ తల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వర్గీయ మద్దాల కాటమ స్వామి కుమారుడు సత్యనారాయణ రత్నం దంపతులు కుమార్తెలు సత్యవతి ఉమా దేవ సత్యవతి ఆధ్వర్యంలో
విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. తాతయ్య కాటమ స్వామి విగ్రావిస్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.అనంతరం విశాఖపట్నం శాసనసభ్యులు పి జి వి ఆర్ నాయుడు (గణబాబు) విశాఖపట్నం జిల్లా గౌరీ గవర సంఘం అధ్యక్షుడు బుద్ద శివాజీ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితులలో కుటుంబాలలో ప్రేమ,అనురాగాలు తగ్గుతున్నాయని బంధుత్వాలు మెరుగుపరుచుకోవాలని కోరారు. కార్యక్రమంలో తోట వరుణ్ ఆర్గనైజర్ రాము చిన్న,సతీష్,గోపి,మాజీ సర్పంచ్ పెంటకోట నాగబాబు మాజీ ఎంపిటిసి రాపేటి పెద్ద, మాజీ ఉపసర్పంచ్ గౌతు జగన్నాథరావు,కిర్లంపూడి ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ గౌతు చిన్న, పెంటకోట శ్రీరాములు,శరకణం భద్రం, దాడి రాజగోపాల్,శరకణం తాతాజీ ,ఆడారి సోమేశ్వరరావు ,తూము చినబాబు, కాళ్ళ సత్యన్నారాయణ పలువురు పాల్గొన్నారు

# యుటిఎఫ్ అందిస్తున్న పాలిటెక్నిక్ ఫ్రీ కోచింగ్ ఇవ్వడం అభినందనీయం.






**ఏలేశ్వరం, పెన్ పవర్, ఏప్రిల్ 15:** స్థానిక యుటిఎఫ్
ఆధ్వర్యంలో నిర్వహించే పాలిటెక్నిక్ ఫ్రీ కోచింగ్ సెంటర్ ను ఎంపీపీ గొల్లపల్లి నరసింహమూర్తి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ అనుభవిజ్ఞులైన ఉపాధ్యాయులు బోధించే పాలిటెక్నిక్ ఎంట్రన్స్ కోచింగ్ తరగతులను విద్యార్థులు అందరూ శ్రద్ధ తో విని అవగాహన చేసుకుని పాలిటెక్నిక్ ఎంట్రెన్స్ లో మంచి ర్యాంకు సాధించాలని తెలియజేస్తూ విద్యార్థులకు తగు సూచనలు చేశారు. సామాజిక స్పృహ కలిగిన ఉపాధ్యాయ సంఘం గా యుటిఎఫ్ నిర్వహించే ఈ కార్యక్రమం చాలా అభినందనీయమని అన్నారు. ఇటువంటి కార్యక్రమాలకు నా వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని ఎంపీపీ అన్నారు.అనంతరం యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఎంపీపీ నర్సింహమూర్తిని సాలువ, పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి జట్ల సోమరాజు, యుటిఎఫ్ సీనియర్ నాయకుడు మతికాని రాంబాబు, ఎస్.గణపతిరావు, వి.విశ్వనాథ్, శిష్టా మూర్తి, ఎస్.రాజశేఖర్, పి.అప్పన్నబాబు, టి. శ్రీనివాసరావు, బి .పెంటారావు, పి. దొర, డి.నాగేంద్ర ప్రసాద్, కె.వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

## కొత్తపేటలో అగ్నిమాపక అవగాహన కార్యక్రమాలు నిర్వహణ





**కొత్తపేట, పెన్ పవర్, ఏప్రిల్15;**అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా కొత్తపేట అగ్నిమాపక కేంద్ర పరిధిలో రెండవ రోజు బుధవారం వివిధ ప్రాంతాలలో అగ్ని ప్రమాదాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.ఈ కార్యక్రమాలు సత్యచంద్ర థియేటర్, కొత్తపేట, అక్షర థియేటర్, రావులపాలెం, ఏపీఎస్ఆర్టీసీ బస్సు స్టాండ్, రిలయన్స్ మార్ట్ రావులపాలెం పనసలదొడ్డి గ్రామంలో చేపట్టారు.
ప్రజలకు అగ్ని ప్రమాదాల నివారణ, అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అగ్నిమాపక పరికరాల వినియోగంపై సిబ్బంది వివరించారు. ఇంచార్జ్ స్టేషన్ ఫైర్ ఆఫీసర్ జి. మహేష్ శంకర్ ఆధ్వర్యంలో సిబ్బంది పాల్గొని ప్రజల్లో అవగాహన పెంపొందించారు.

# ఇంటర్మీడియట్ ఫలితాల్లో ఆలమూరు జూనియర్ కళాశాల విద్యార్థుల ప్రతిభ






**ఆలమూరు, పెన్ పవర్, ఏప్రిల్ 15;**బుధవారం విడుదలైన ఇంటర్మీడియట్ ఫలితాల్లో ఆలమూరు జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. మొదటి సంవత్సరం విద్యార్థులు 72% మంది ఉత్తీర్ణత సాధించగా, రెండవ సంవత్సరం విద్యార్థులు 71% మంది ఉత్తీర్ణత సాధించారు. రెండవ సంవత్సరం ఫలితాల్లో ఎంపీసీ గ్రూపుకు చెందిన జీఎస్ఎన్ మూర్తి 1000 మార్కులకు గాను 945 మార్కులు సాధించి గ్రూప్ టాపర్ గా నిలిచాడు. మొదటి సంవత్సరం ఫలితాల్లో హెచ్ ఈ సీ గ్రూపుకు చెందిన డి భవ్య శ్రీ 500 మార్కులకు గాను 451 మార్కులు సాధించి గ్రూప్ టాపర్ గా నిలిచింది.విద్యార్థులందరినీ ప్రిన్సిపల్ నల్లమిల్లి సురేష్ రెడ్డి అభినందించారు. ఆలమూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రభుత్వం అందిస్తున్న అన్ని సదుపాయాలను విద్యార్థులు వారి తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని సందర్భంగా కోరారు.

# శిధిలాల నుంచి శోభాయమానంగా రామాలయం

**మొదటి విరాళంగా రూ.2 లక్షలు అందజేసిన చిన్నబాబు**





**ఆలమూరు, పెన్ పవర్, ఏప్రిల్ 15;**ఆలమూరు మండలం పెనికేరు ఎస్సీ మాలపేటలో శిథిలావస్థకు చేరుకున్న రాముల వారి ఆలయం, భక్తి భావనతో పాటు దాతృత్వం కలిసివచ్చి నేడు సుందరమైన దేవాలయంగా రూపుదిద్దుకుంది. ఈ పునర్నిర్మాణానికి తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు, వెంకటేశ్వర సంస్థల అధినేత ఈదర చిన్నబాబు కీలక భూమిక పోషించారు. ఆలయం దుస్థితిని గుర్తించిన ఎస్సీ సంఘం పెద్దలు చిన్నబాబును కలిసి సహాయం కోరగా, ఆయన వెంటనే స్పందించి మొదటి విరాళంగా రూ.2 లక్షలు అందజేశారు.ఈ విరాళంతో ఆలయ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టి, గ్రామ ప్రజల సహకారంతో నిర్మాణాన్ని వేగవంతంగా పూర్తి చేశారు. చిన్నబాబు ఇచ్చిన ఆర్థిక సహాయం గ్రామ ప్రజల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. ఆయన చూపిన మార్గంలో గ్రామస్థులు కూడా స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమ వంతు సహకారం అందించారు. భక్తి, ఐక్యత, సేవా తపన కలిసి ఆలయ నిర్మాణాన్ని వేగంగా పూర్తి చేయించాయి. ఒకప్పుడు శిధిలంగా ఉన్న ఆలయం ఇప్పుడు అందమైన శిల్పకళతో, పవిత్ర వాతావరణంతో గ్రామానికి ఆధ్యాత్మిక కాంతిని అందిస్తోంది. తాజాగా ఈనెల 11న అంగరంగ వైభవంగా ప్రతిష్ట కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామమంతా భక్తి వాతావరణంలో మునిగిపోయింది. పూజా కార్యక్రమాలు, హోమాలు, ప్రత్యేక అలంకరణలతో ఆలయం కళకళలాడింది. రామాలయ పునర్నిర్మాణానికి విశేష సహకారం అందించిన చిన్నబాబును సంఘ పెద్దలు ఘనంగా సన్మానించారు. ఆలయ ప్రతిష్ట కార్యక్రమం అనంతరం ఏర్పాటు చేసిన సభలో గ్రామ పెద్దలు, భక్తులు కలిసి చిన్నబాబుకు శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛాలు అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, భక్తులు మాట్లాడుతూ శిధిలావస్థలో ఉన్న ఆలయాన్ని సుందరంగా పునర్నిర్మించడంలో చిన్నబాబు చేసిన సహకారం మరువలేనిదని కొనియాడారు. సమాజానికి సేవ చేయడంలో ఆయన ఎప్పుడూ ముందుంటారని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, భక్తులు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను ఘనంగా నిర్వహించారు.

# మలబార్ ట్రస్ట్ సేవలు ఆదర్శం

**157 మంది విద్యార్థినిలకు రూ.12.52 లక్షల స్కాలర్షిప్లు పంపిణీ**







**రామచంద్రపురం, పెన్ పవర్,ఏప్రిల్ 15:** ప్రముఖ మలబార్ చారిటబుల్ ట్రస్ట్ చేపడుతున్న సామాజిక సేవలు ఆదర్శప్రాయమని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ కొనియాడారు. మహిళా విద్యను ప్రోత్సహిస్తూ స్కాలర్షిప్లు అందించడం గొప్ప విషయమని పేర్కొన్నారు.స్థానిక ఎన్వీఆర్ ఫంక్షన్ హాల్లో నిర్వహించిన కార్యక్రమంలో మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 16 ప్రభుత్వ కళాశాలల్లో చదువుతున్న 157 మంది విద్యార్థినిలకు మొత్తం రూ.12 లక్షల 52 వేల ఉపకార వేతనాలను మంత్రి సుభాష్ చేతుల మీదుగా పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విద్యార్థినిల భవిష్యత్తు అభివృద్ధికి ఈ సహాయం దోహదపడుతుందని తెలిపారు. సమాజ అభివృద్ధికి మహిళా విద్య కీలకమని, కార్పొరేట్ సంస్థలు సిఎస్ఆర్ నిధులను విద్యకు వినియోగించడం ద్వారా సమాజంలో మార్పు తీసుకురావచ్చని పేర్కొన్నారు. 'పే బ్యాక్ టు సొసైటీ' భావనతో సంస్థలు సామాజిక బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు.కాకినాడ మలబార్ గోల్డ్ షోరూమ్ మేనేజర్ ఉండవల్లి సాయి శ్రీకాంత్ మాట్లాడుతూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో తమ ట్రస్ట్ ద్వారా 493 మంది విద్యార్థులకు మొత్తం రూ.39 లక్షల 18 వేల ఉపకార వేతనాలు అందించినట్లు తెలిపారు. గత సంవత్సరంతో పోలిస్తే ఈసారి మరింత విస్తృతంగా స్కాలర్షిప్లు అందిస్తు న్నామని, 2026--27 సంవత్సరానికి రూ.200 కోట్ల లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని చెప్పారు. సాధారణం గా 2 శాతం సిఎస్ఆర్ నిధుల స్థానంలో 5 శాతం వరకు విద్య కోసం వినియోగిస్తున్నామని వివరించారు.ఈ కార్యక్రమంలో మలబార్ షోరూమ్ హెడ్ అఖిల్, మేనేజర్ ఉండవల్లి సాయి శ్రీకాంత్, మార్కెటింగ్ ఇన్‌చార్జ్ పేపకాయల శ్రీరామ్, జనసేన ఇన్‌చార్జ్ పోలిశెట్టి చంద్రశేఖర్, పట్టణ టిడిపి అధ్యక్షుడు ఉండవల్లి శివ, కాజులూరు మండల అధ్యక్షుడు చవ్వా కుల నారాయణమూర్తి,వివిధ కళాశాలల ప్రిన్సిపల్స్ నాగ శ్రీనివాస్,కాంచనమాల, ధనకృష్ణ,బి.చంద్రశేఖరరావు, ఏబీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టు హెల్త్ స్కీమ్ పొడిగింపు

**జీవో ఎం.ఎస్ నెం. 43 జారీ**




**కాకినాడ, పెన్ పవర్ ఏప్రిల్ 15:** రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న వర్కింగ్ జర్నలిస్టు హెల్త్ స్కీమ్‌ను 2026--27 ఆర్థిక సంవత్సరానికి పొడిగిస్తూ వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ జీవో ఎం.ఎస్ నెం. 43 ద్వారా ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచార పౌర సంబంధాల శాఖ ఉప సంచాలకులు పి. తిమ్మప్ప తెలిపారు.కాకినాడ జిల్లాలో మీడియా అక్రిడిటేషన్ పొందిన వర్కింగ్ జర్నలిస్టులు ఈ పథకం కింద ప్రీమియంగా రూ.1,250ను షషష.ఎటఎం.ఖజూ.స్త్రశీజ.అఅ?? వెబ్‌సైట్ ద్వారా చెల్లించి లబ్ధి పొందాలని సూచించారు.ఎముఎ శీట ాూఎఎశీబత్:
8342-00-120-01-03-001-001
ణఊూ జశీవ: 2703 0802 003
ప్రీమియం చెల్లించిన జర్నలిస్టులు ఒరిజినల్ చలానా, అక్రిడిటేషన్ కార్డు ప్రతులు, హెల్త్ కార్డు (రెన్యువల్ చేసుకునేవారు) సమర్పించాలి. కొత్తగా దరఖాస్తు చేసుకునేవారు తమ కుటుంబ సభ్యుల ఆధార్ కార్డులు, ఫోటోలు (జీూ+ ఫార్మాట్‌లో), సంబంధిత జిరాక్స్ కాపీలను కాకినాడ రామారావుపేట శేషసాయి వీధి 7-4-2 నంబరులో ఉన్న కార్యాలయంలో అందజేయాలని తెలిపారు.వర్కింగ్ జర్నలిస్టు హెల్త్ స్కీమ్ మొత్తం ప్రీమియం రూ.2,500 కాగా, ఇందులో జర్నలిస్టు వాటా రూ.1,250, ప్రభుత్వం తన వాటా రూ.1,250 చెల్లిస్తుందని వివరించారు. ఈ పథకం జర్నలిస్టు, వారి భార్య/భర్త, పిల్లలు, ఆధారపడిన తల్లిదండ్రులకు వర్తిస్తుందని పేర్కొన్నారు.

# ప్రయివేటు బస్సులతో ట్రాఫిక్ సమస్యలు

**వాహనదారుల ఇబ్బందులు**

**అంబాజీపేట, పెన్ పవర్, ఏప్రిల్ 15:** స్థానిక బస్టాండ్ వద్ద ప్రయివేట్ బస్సులు నిలుపుదల చేయడంతో నిత్యం ట్రాఫిక్ సమస్యలతో వాహనదారులు, ప్రయాణికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తెంగాణ రాష్ట్రం హైదరాబాద్ వెళ్ళే బస్సులు అమలాపురం నుండి నిత్యం అధిక సంఖ్యలో అంబాజీపేట మీదుగా వెళుతున్నాయి. అన్ని ట్రావెల్ కంపెనీలకు చెందిన బస్సులు ఒకేసారి అంబాజీపేట చేరుకోవడంతో బస్టాండ్ వద్ద ప్రతీరోజూ ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయి. ప్రయివేటు వాహనాల టిక్కెట్ విక్రయదారులు బస్టాండ్ ఎదురుగా నిలపడంతో ఒకేసారి అర్టీసి కు చెందిన బస్సులు, ప్రయివేటు ట్రావెల్స్ బస్సులు అన్ని రైలు పెట్టెలు గా పొడవుగా నిలపడంతో చాలా ఇబ్బందులు ఎదురౌతున్నాయి. బస్టాండు కు సమీపంలో మద్యంషాపు, సమీపంలో కాఫి హోటల్ ఉండడంతో సాయంత్రం సమయంలో ఈ ప్రాంతంలో అధిక ట్రాఫిక్ అధికంగా ఉంటుంది. ప్రయివేటు ట్రావెల్స్ బస్సు లను బస్టాండ్ కు కూతవేటు దూరంలో నిలుపదల చేస్తే ట్రాఫిక్ సమస్యలు లేకుండా వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు




తొలగుతాయని . ఆదిశగా అటు సంబంధిత అధికారులు, పోలీసు అధికారులు దృష్టి చారించాలని ప్రజలు కోరుకుంటున్నారు.

## వాడపల్లి వెంకన్న నిత్య అన్నదానానికి భక్తులు విరాళం






**ఆత్రేయపురం పెన్ పవర్ ఏప్రిల్ 15:** ఏడువారాల వెంకన్న స్వామి దర్శనానికి భారీగా భక్తులు తరలివచ్చి భక్తిశ్రద్ధలతో స్వామివారిని దర్శించుకున్నారు. చందన స్వరూపునిగా అలంకరించబడిన వెంకన్న స్వామివారి నిలువెత్తు దర్శనం భక్తులను ఆధ్యాత్మిక ఆనందంలో ముంచెత్తింది. ఆలయం అంతటా గోపాలనామస్మరణలు, భజనలు మారుమోగగా, భక్తులు క్రమపద్ధతిలో స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ పుణ్య సందర్భంగా తూర్పు గోదావరి జిల్లా ఆత్రేయపురం మండలం తాడిపూడి గ్రామానికి చెందిన "హేమాద్రి ఆక్వా ఫీడ్స్ అండ్ నీడ్స్" సంస్థ ప్రతినిధులు గొట్టుముక్కల శ్యామ్ ప్రసాద్ రాజు, ముదునూరి జానకి రవీంద్ర సుబ్బరాజు, కలిదిండి సూర్యనారాయణ వర్మ, కూసంపూడి రామకృష్ణరాజు కుటుంబ సభ్యులు కలిసి విశేష భక్తితో ఆలయాన్ని సందర్శించారు. స్వామివారి కృపతో సమాజానికి సేవ చేయాలనే సంకల్పంతో, వారు ఆలయంలో నిత్యంగా నిర్వహించే అన్నదాన కార్యక్రమానికి రూ. 1,01,116/- మొత్తాన్ని విరాళంగా సమర్పించారు. వారి ఈ సేవా భావాన్ని ఆలయ అధికారులు అభినందించారు. భక్తులకు అన్నదానం చేయడం అన్నది అత్యున్నత పుణ్యకార్యంగా భావిస్తారని, ఇలాంటి దాతల సహకారంతో ఆలయ సేవా కార్యక్రమాలు మరింత విస్తరించనున్నట్లు తెలిపారు. వీరిని ఆలయ అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించారు. అనంతరం ఆలయ చైర్మన్ ముదునూరి వెంకటరాజు, దాతలకు స్వామివారి చిత్రపటాన్ని అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు కూసంపూడి రామకృష్ణ రాజు బంధువులు పాల్గొన్నారు.

## కాకినాడలో అక్రమంగా ఎగుమతి చేస్తున్న పీడీఎస్ బియ్యం భారీగా సీజ్





**కాకినాడ, పెన్ పవర్,ఏప్రిల్ 15:** రాష్ట్ర పౌర సరఫరా కార్పొరేషన్ చైర్మన్ తోట సుధీర్ ఆధ్వర్యంలో పౌర సరఫరా, రెవెన్యూ అధికారుల సంయుక్త బృందం నిర్వహించిన తనిఖీలలో అక్రమంగా ఎగుమతి చేస్తున్న పీడీఎస్ బియ్యం భారీగా పట్టుబడింది. మొత్తం రూ. 3.54 కోట్ల విలువైన 910 టన్నుల బియ్యాన్ని అధికారులు సీజ్ చేశారు. తనిఖీలలో భాగంగా కాకినాడ యాంకరేజ్ పోర్టు సమీపంలో ఉన్న భార్జీలు, రైల్వే వ్యాగన్‌లలో బియ్యాన్ని పరిశీలించారు. అనంతరం చెక్‌పోస్ట్ రిజిస్టర్‌లను పరిశీలించి బాయిల్డ్ రైస్, రా రైస్, రా బ్రోకెన్స్ ఎగుమతి విధానాన్ని తెలుసుకున్నారు. టెక్నికల్ సిబ్బంది నమోదు చేసిన వివరాలను సమీక్షించి సూచనలు జారీ చేశారు. మానస ఎంటర్‌ప్రైజెస్ గోదాములో స్టాక్‌ను పరిశీలించగా ఫోర్టిఫైడ్ కెర్నల్స్ ఉన్నట్లు గుర్తించారు. అనంతరం స్వార్టెక్స్ ప్లాంట్, ఎన్‌డీఆర్ గోదాం, చిత్ర ఆగ్రో ఎగ్జిట్స్, కొవ్వూరి ఆనంద్ రెడ్డి సార్టెక్స్ ప్లాంట్‌లను తనిఖీ చేశారు. అక్కడ 10 లారీల్లో బియ్యం ఉన్నట్లు గుర్తించి శాంపిల్స్ సేకరించి పరీక్షించగా, బాయిల్డ్ రైస్‌లో ఫోర్టిఫైడ్ కెర్నల్స్ ఉన్నట్లు తేలింది. మిల్ యాజమాన్యాన్ని విచారించగా ఒడిశా, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి బియ్యాన్ని కొనుగోలు చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రజా పంపిణీ వ్యవస్థకు సంబంధించిన బాయిల్డ్ బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి, అక్రమంగా ఇతర దేశాలకు ఎగుమతి చేస్తున్నట్లు అధికారులు నిర్ధారించారు. సీజ్ వివరాలు:
10 లారీలలో 260 టన్నులు, ప్లాంట్‌లో 650 టన్నులు కలిపి మొత్తం 910 టన్నుల బాయిల్డ్ బియ్యం స్వాధీనం చేసుకున్నారు. బియ్యం విలువ రూ. 2.54 కోట్లు కాగా, లారీల విలువ సుమారు రూ. 1 కోటి కలిపి మొత్తం రూ. 3.54 కోట్ల ఆస్తిని సీజ్ చేసినట్లు జిల్లా పౌర సరఫరా అధికారి రుద్రరాజు సత్యనారాయణ రాజు తెలిపారు. నమూనాలను రసాయన విశ్లేషణ కోసం పంపించారు. పీడీఎస్ ద్వారా పంపిణీ చేసే బియ్యంలో ఉండే ఫోర్టిఫైడ్ కెర్నల్స్ బహిరంగ మార్కెట్‌లో ఉండవని, వాటిని అక్రమంగా కొనుగోలు చేసి ఎగుమతి చేయడం నేరమని అధికారులు స్పష్టం చేశారు. బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా వాహనాలను నడిపితే కఠిన చర్యలు.

-ప్రత్తిపాడు ఎస్సై,ఎస్ లక్ష్మీకాంతం హెచ్చరిక.





**కిర్లంపూడి/ప్రత్తిపాడు, పెన్ పవర్, ఏప్రియల్ 15:** ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ప్రత్తిపాడు ఎస్సై, ఎస్ లక్ష్మి కాంతం హెచ్చరించారు .బుధవారం స్థానిక ఇంద్రమాల్ హాస్పిటల్ సమీపంలో ప్రత్యేక డ్రైవ్ లో భాగంగా పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించి,సరైన పత్రాలు లేని వాహనాలపై జరిమానాలు విధించారు. అలాగే మద్యం తాగి ప్యాసింజర్ ఆటో నడిపిన ఒక డ్రైవర్ 20 మంది ప్రయాణికులతో ప్రమాదకరంగా ప్రయాణం చేస్తున్నాడు. వెంటనే స్పందించిన పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై,ఎస్ లక్ష్మీకాంతం మాట్లాడుతూ వాహనదారులు డ్రైవింగ్ లైసెన్స్ తో పాటు ఇతర ధృవపత్రాలు తప్పనిసరిగా కలిగిఉండాలన్నారు. ద్విచక్రవాహనాలు నడిపేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. రోడ్డు ప్రమాదాలు నివారించే కార్యక్రమంలో భాగంగా వాహనాలు తనిఖీ చేయడం జరుగుతుందన్నారు. మద్యం తాగి వాహనాలు నడపితే జైలు శిక్షతో పాటు రూ. 10 వేలు అపరాధ రుసుము విధించడం జరుగుతుందన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వరాదన్నారు. ఈ ప్రత్యేక డ్రైవ్ లో గోవింద్,మూర్తి తదితరులు ఉన్నారు.

## డ్వాక్రా యానిమేటర్లకు ఉచిత మొబైల్ ఫోన్ల పంపిణీ





**కొత్తపేట,పెన్ పవర్, ఏప్రిల్ 15:** కొత్తపేట మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో 64 మంది డ్వాక్రా యానిమేటర్లకు ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఉచిత మొబైల్ ఫోన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం,గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో డ్వాక్రా మహిళలకు అనేక సంక్షేమ, ఆదాయాభివృద్ధి పథకాలు అమలవుతున్నాయని తెలిపారు. స్వయం సహాయక సంఘాల బ్యాంకు అనుసంధాన రుణాలు, స్త్రీనిధి రుణాలు, ఉన్నతి వంటి పథకాల అమలులో యానిమేటర్ల పాత్ర కీలకమని పేర్కొన్నారు. యాప్‌ల ద్వారా సర్వేలు,డేటా సేకరణ,సభ్యుల వివరాల నిర్వహణకు ఈ మొబైల్ ఫోన్లు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు.
యానిమేటర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని మరింత ఉత్సాహంతో,బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. మండలంలోని పారిశ్రామికవేత్తలకు సూక్ష్మ,చిన్న,మధ్య తరహా పరిశ్రమల ద్వారా బ్యాంకు రుణాలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నాయకులు, అధికారులు, డ్వాక్రా మహిళలు మరియు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# నియోజకవర్గంలో పలు కుటుంబాలకు ముద్రగడ గిరిబాబు పరామర్శ

**కిర్లంపూడి/ప్రత్తిపాడు, పెన్ పవర్ ఏప్రియల్ 15:** ప్రత్తిపాడు నియోజకవర్గంలో పలు కుటుంబాలకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి ముద్రగడ గిరిబాబు బుధవారం పరామర్శించారు. ప్రత్తిపాడు మండలంలోని వేములపాలెం గ్రామానికి చెందిన ములికి రామకృష్ణ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. విషయం తెలుసుకున్న ముద్రగడ గిరిబాబు బుధవారం రామకృష్ణ నివాసంలో కలిసి వారి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకుని వారు త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు. పెద్దిపాలెం గ్రామానికి చెందిన మాకా చంటిబాబు ఇటీవల అనారోగ్యానికి గురైయ్యారు. విషయం తెలుసుకున్న గిరిబాబు చంటిబాబు ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. శంఖవరం మండలం అన్నవరం గ్రామానికి చెందిన బుంగా ఏసుదాసు పెద్ద కుమారుడు జాన్ హైడ్ (పాస్టర్) ఇటీవల కాలంలో మృతి చెందారు. విషయము తెలుసుకున్న ముద్రగడ గిరిబాబు ఏసుదాసు కుటుంబాన్ని పరామర్శించి వారి కుటుంబానికి తమ తీవ్ర ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. అన్నవరం గ్రామానికి చెందిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అభిమాని ఇందుగబిల్లి సత్తిబాబు ఇటీవల ఒక రోడ్డు ప్రమాదంలో కాలు తీవ్ర గాయమై ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయము తెలుసుకున్న ముద్రగడ గిరిబాబు బుధవారం సత్తిబాబు నివాసానికి వెళ్లి పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి చేయించుకున్నారు. అన్నవరం గ్రామంలో



పర్యటించి గుండె ఆపరేషన్ చేయించుకుని ఇంటి వద్ద కోలుకుంటున్న వైసీపీ సీనియర్ నాయకులు కొండపల్లి అప్పారావు పరామర్శించి ఆరోగ్య పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. వేములపాలెం గ్రామానికి చెందిన నంబరు నాగరాజు భార్య అప్పలరాజు ఇటీవల అనారోగ్యానికి గురయ్యారు. విషయం తెలుసుకున్న ముద్రగడ గిరిబాబు వారి ఇంటికి వెళ్లి పరామర్శించి అప్పలరాజు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మెట్టు చింత గ్రామానికి చెందిన పొత్తూరు రమణ తల్లి ఇటీవల



మరణించారు. విషయము తెలుసుకున్న గిరిబాబు వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తీవ్ర ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. ప్రత్తిపాడు గ్రామానికి చెందిన మదినే నూకరాజు మేనల్లుడు దనేకుల చిన్న ఇటీవల మృతి చెందారు. దీంతో విషయం చేసుకున్న గిరిబాబు నూకరాజు కుటుంబ సభ్యులను పరామర్శించి చిన్న మృతికి తీవ్ర ప్రగాఢ సంతాపాన్ని సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.